తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
ఆదివారం
30 ఆగష్టు 2026
పేజీలు : 8
Follow :

## నీట్-పీజీ 2026 పరీక్ష నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

- మూడు పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్
- ఉదయం 7:30 నుంచి 8:45 గంటల వరకు మాత్రమే అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి
- విద్యుత్, వైద్యం, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు
- పరీక్ష పర్యవేక్షణకు రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు
- సీసీటీవీ నిఘా, మొబైల్ జామర్లతో పటిష్ట భద్రతా చర్యలు



పెద్దపల్లి,ఆగస్టు 29(జనంసాక్షి) : ఆగస్టు 30న జిల్లాలో నిర్వహించనున్న నీట్-పీజీ 2026 పరీక్షను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం డీసీపీ రామ్ రెడ్డితో కలిసి లిపెద్దపల్లి మండలంలోని పెద్దకల్వలలోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల, పెద్దపల్లి లోని బండారికుంట సమీపంలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల, రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా ఏర్పాట్లను కలెక్టర్ కోయ శ్రీహర్షలి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ నీట్-పీజీ 2026 పరీక్ష ఆగస్టు 30న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులను ఉదయం 7:30 గంటల నుంచి 8:45 గంటల వరకు మాత్రమే పరీక్షా హాల్లోకి అనుమతిస్తామని చెప్పారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డుతో పాటు ఒరిజినల్ పర్మినెంట్/ప్రొవిజనల్ ఎంబీబీఎస్ క్వాలిఫికేషన్ సర్టిఫికెట్, దాని స్వీయ ధ్రువీకరించిన జిరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని సూచించారు. అడ్మిట్ కార్డును నిర్దేశిత విధంగా ఒకే ఏ4 పేపర్పై కలర్లో బ్యాక్-టు-బ్యాక్ ప్రింట్ చేసుకోవాలని తెలిపారు.పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని టీజీఎన్పీడీసీఎల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో హెల్త్ అసిస్టెంట్లను ఏర్పాటు చేసి అవసరమైన వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలని

వార్తా లోపలి పేజీలో



## మంత్రి శ్రీధర్ బాబుతో మారిషస్ మంత్రి భేటీ

**మంథని, ఆగస్టు 29,( జనంసాక్షి):** మారిషస్ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ శాఖ మంత్రి లుచ్మనన్ పెంతియా శనివారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో పరిపాలన, టూరిజం, ఐటీ/ఐటీఈఎస్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, నైపుణ్యాభివృద్ధి, విద్యా తదితర రంగాల్లో 'తెలంగాణ ? మారిషస్' మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు గల అవకాశాలు, కార్యాచరణపై ఇరువురు ప్రధానంగా చర్చించారు. ఆనతికాలంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న 'తెలంగాణ'ను తమ దేశం అత్యంత నమ్మకమైన భాగస్వామిగా పరిగణిస్తోందని ఈ సందర్భంగా మారిషస్ మంత్రి లుచ్మనన్ పెంతియా పేర్కొన్నారు. మారిషస్ ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు, ఆధునిక పరిపాలనా విధానాలపై వారికి శిక్షణ ఇచ్చేందుకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును కోరారు. అలాగే... రాష్ట్రంలోని ఎంసీహెచ్ఆర్డీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఇతర ప్రముఖ విద్యా సంస్థలతోనూ పనిచేసేందుకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉందన్నారు. అన్ని రంగాల్లోనూ మారిషస్ కు సహాయ సహకారాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి శ్రీధర్బాబు వెల్లడించారు. అంతర్జాతీయ భాగస్వామ్యాలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. డిసెంబర్ 7,8 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026"లో పాల్గొనాలని మంత్రి లుచ్మనన్ పెంతియాను ఆహ్వానించారు. సమావేశంలో సెక్రటరీ ఫర్ పబ్లిక్ సర్వీస్ దేవేంద్ర గోపాల్, అటల్ బిహారీ వాజ్పేయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ సర్వీస్ అండ్ ఇన్నోవేషన్ (ఏబీపీఎస్ఐ) బోర్డ్ ఛైర్పర్సన్ డాక్టర్ నికోలస్ రాగోడూ , ఏబీపీఎస్ఐ రిజిస్ట్రార్ డా. రమేష్ దుర్బరీ, ఎంఈఏ బ్రాంచ్ సెక్రటేరియట్ హెడ్ మాధవ్ ఆర్. సుల్ఫులే, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీఈఅండ్ సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

### నోటీసుల జారీ, అభ్యంతరాల విచారణను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**కామారెడ్డి, జిల్లా ప్రతినిధిఆగస్టు 29 (జనంసాక్షి)**



ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేసి, నోటీసుల జారీ, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.శనివారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాఎఖీ ప్రక్రియలో భాగంగా నోటీసుల జారీ, విచారణ, పరిష్కార చర్యల పురోగతిని సమీక్షించారు.నోటీసుల పంపిణీని వేగవంతం చేసి పెండింగ్లో ఉన్న అన్ని నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని సుదర్శన్ రెడ్డి సూచించారు. నోటీసు అందజేసిన తేదీ నుంచి 7 రోజుల గడువు పూర్తైన అనంతరం విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు. ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట సమయంలో విచారణ నిర్వహించడంతో పాటు సంబంధిత రికార్డులు, పత్రాల పరిశీలనను వేగవంతం చేయాలని ఆదేశించారు.

వార్తా లోపలి పేజీలో




## తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దేవుని కోరుకున్న..

### సర్ ప్రక్రియ జరిగిన రాష్ట్రాల్లో బిజెపి కుట్రలతో ఓట్ల శాతం తగ్గింది : మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 29 (జనంసాక్షి)**




తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన భీమేశ్వరస్వామి వారిని వేడుకున్నని బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. శనివారం ఉదయం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో కలిసి మంత్రి స్వామివారిని దర్శించుకున్నారు. వారు ఆలయంలోకి రాగానే ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వాచనం నిర్వహించగా ఆలయ డిఇఓ ప్రతాప్ నవీన్ స్వామివారి శేష వస్త్రాలు ప్రసాదాలను అందజేశారు.అనంతరం మంత్రి పొన్నం విలేకరులతో మాట్లాడుతూ కొత్తకొండ వీరభద్ర స్వామి వారి నక్షత్రమాల ధరించిన పిదప వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో సుభిక్షంగా వర్ధిల్లాలని,ఎలాంటి కరువు కాటకాలు లేకుండా ప్రజలంతా పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని మనస్పూర్తిగా మొక్కుకున్నాను అని చెప్పారు. సర్ పై రివిజన్ జరిగిన రాష్ట్రాల్లో బీజేపీ కుట్రలతో ఓట్ల శాతం తగ్గించిద న్నారు. తెలంగాణలో కాంగ్రెస్ గెలుస్తుంది కాబట్టి ఇక్కడ ఓట్లపై బీజేపీ కుట్ర చేయాలని భావిస్తుందని,బయట రాష్ట్రాల్లో కూడా ఎన్నికల కమిషన్ ఒక ఏజెండా గా పని చేసిందని ప్రజలు ఆరోపించరన్నారు.ఇక్కడ కూడా ఒక్క ఓటు పోకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.తెలంగాణ వ్యాప్తంగా ఓటర్ల సవరణ జరుగుతుందని,నిజాయితీ గల ఒక్క ఓటు పోవద్దని ప్రభుత్వం ఉద్దేశమన్నారు.స్పెలింగ్ మిస్టేక్ లు, సర్ లో మిస్ అయిన వారి కోసం ఈ సవరణ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశని ఉపయోగించు కోవాలని సూచించారు.వారి వెంట మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికర రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, పిఆర్ఓ పెరిక శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

## నోటీసుల జారీ, అభ్యంతరాల విచారణను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

అనామలీస్, నో మ్యాపింగ్ జాబితాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాల సందర్భంగా సంబంధిత వ్యక్తులు సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రస్తుత స్థితిని రోజువారీగా నోటీస్ బోర్డుపై నవీకరించాలని, మొత్తం ప్రక్రియలో పారదర్శకత, జవాబుదా రీతనం పాటించాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కార ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. నాఎఖీ ప్రక్రియ కోసం నియమించిన ఏఈఆర్ఓలకు అవసరమైన శిక్షణ అందించడంతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

**కామారెడ్డి జిల్లాలో 1.84 లక్షల నోటీసులు జనరేట్**

జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించి 1,84,742 నోటీసులు జనరేట్ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 36,664 నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. అలాగే 2,102 నోటీసుల హియరింగ్ ప్రక్రియ పూర్తయిందని, వాటి పరిష్కారానికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

భారత ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్వహిస్తూ, నిర్ణీత గడువులోగా మొత్తం ప్రక్రియను పూర్తి చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రతిమ సింగ్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, కామారెడ్డి తహసీల్దార్ హిమబిందు, సూపరింటెండెంట్ రాజేశ్వర్, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మోసాలపై కదనభేరి

ముస్తాబాద్ ఆగస్టు 29 (జనం సాక్షి)

సెప్టెంబర్ 1న తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ సర్కార్‌పై చార్జ్‌షీట్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి పిలుపు ముస్తాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ మోసాలపై బిఆర్ఎస్ కాదనభేరి-పార్టీ శ్రేణులకు బిఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ముస్తాబాద్ మండల బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు భోంపెల్లి సురేందర్ రావు ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పరిపాలన చేపట్టి సెప్టెంబర్ 2 నాటికి 1000 రోజులు పూర్తి అవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రజలను 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి నెరవేరుస్తమని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయడానికి నిరసన కార్యక్రమాల రూపకల్పనకై ముస్తాబాద్ మండలం బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలతో సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు , సిరిసిల్ల జిల్లా బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు తోట అగన్న సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ తుల ఉమ అక్క పాల్గొని పార్టీ జరిపే నిరసన కార్యక్రమాల వివరాలు తెలియజెయడం జరిగింది

ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ రైతు బందు అధ్యక్షులు కల్వకుంట్ల గోపాల్ రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ కో అప్షన్ సభ్యులు సర్వర్ పాషా, మాజీ ఏఎంసి చైర్మన్ అంజయ్య, పార్టీ సీనియర్ నాయకులు చీటి వెంకట నర్సింగ రావు, మాజీ సెస్ డైరెక్టర్ కొమ్ము బాలయ్య,మాజీ , మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్,సర్పంచ్ ఫోరమ్ మండల అధ్యక్షులు చిగురు నరేష్, ముస్తాబాద్ పట్టణ పార్టీ అధ్యక్షులు ఏద్దండీ నర్సింహా రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షులు రాచమడుగు సంతోష్ రావు,గూడూరి భరత్,మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, ముస్తాబాద్ మండల యూత్ అధ్యక్షులు శీలం స్వామి, మండల అధ్యక్షుడు ఎండి నవాజ్, పార్టీ నాయకులు చెవుల మల్లేశం యాదవ్,మెంగని మనోహర్, కొండ శ్రీనివాస్ గౌడ్, ఆనంద్ రావు,బైతి నవీన్, కల్వకుంట్ల శ్రీనివాస్ రావు,వివిధ గ్రామాల సర్పంచ్ సర్పంచ్లు అన్ని గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు , నాయకులు కార్యకర్తలు పార్టీ యూత్ సభ్యులు పార్టీ నాయకులు వివిధ గ్రామాల సర్పంచ్లు అన్ని గ్రామాల పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు , నాయకులు కార్యకర్తలు పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## పారమిత విద్యాసంస్థలలో ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలు

**కరీంనగర్, క్రైమ్ ఆగస్టు 29(జనంసాక్షి ) :**

పారమిత విద్యాసంస్థలలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేజర్ ద్యానచంద్ జన్మదినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాద్యాయులు, సమన్వయ కర్తలు, వ్యాయామ ఉపాధ్యాయులు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాలులర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు క్రీడా పతాకాన్ని ఎగురవేసి, క్రీడా జ్యోతిని వెలిగించి ఘనంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పారమిత విద్యా సంస్థల అధినేత ఇ .ప్రసాదరావు విద్యార్థులకు, వ్యాయామఉపాధ్యాయులకు,తల్లిదండ్రులకు రాష్ట్ర జాతీయ క్రీడాదినోత్సవ, మిత్రులకుశుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనుకర్ రావు, రాకేశ్, వి.యు.యం. ప్రసాద్, వినోద్ రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## పల్లె దవాఖాన తొందరగా ప్రారంభించండి- బొడ్డు రాజేష్

**మల్లాపూర్ ఆగస్టు29( జనంసాక్షి)**

పల్లె దవాఖాన తొందరగా ప్రారంబించాలి (ఆయుషమాన్ ఆరోగ్యమందిర్ ను త్వరగా ప్రారంభించి గ్రామస్తులకు మెరుగైనా వైద్యం అందేలాచుడాలనీ మననేస్తాం స్వచ్ఛంద సంస్థ వ్యవస్తాపాకులు బొడ్డు రాజేష్ డిమైండ్ చేసారు మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలో గత ప్రభుత్వం లో మాజీ సర్పంచ్ బొడ్డు సుమలత కృషితో మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావ సహకారం తో సుమారు 20లక్షల అంచనా వ్యయం తో మంజూరి చేయించడం జరిగిందని ఇట్టి ఆరోగ్యకేంద్రం సంబంతధిత అధికారులు శ్రద్దా చూపి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బొడ్డు రాజేష్ అన్నారు. ఈ విషయమై కాంట్రాక్టర్ను వివరణ కోరగా నిర్మాణం చేసి సంవత్సరం గడుస్తున్న ఇప్పటివరకు బిల్లు రాలేదని తెలియజేశారు, అలాగే మండల వైద్యాధికారికి భవనాన్ని అప్పగించినట్లు కాంట్రాక్టర్ తెలిపారు.

# సర్కార్ స్థలాలను కాపాడాలి

## అధికారుల నిర్లక్ష్యంతో అన్యాక్రాంతమవుతున్నాయి

## బోయినిపల్లి ప్రవీణ్‌రావు

**కరీంనగర్ టౌన్ ఆగస్టు 29 ( జనంసాక్షి)**

అధికారుల నిర్లక్ష్యం కారణంగా కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉందని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జరిగిన కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గ సమావేశంలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు.తన డివిజన్ పరిధిలోని వివేకానంద స్వామి విగ్రహ స్థలం ప్రభుత్వానిదేనని, అయితే అధికారులు పట్టించుకోకపోవడంతో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ఆ స్థలం తమదంటూ కోర్టును ఆశ్రయించారని తెలిపారు. ఈ వ్యవహారంపై తాము న్యాయపరంగా ముందుకు వెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు.కార్పొరేషన్ పరిధిలోని ఇతర ప్రభుత్వ స్థలాలపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఆయా స్థలాలకు సంబంధించిన పత్రాలు, ఆధారాలను పరిశీలించి ప్రభుత్వ స్థలాలను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా వాటిని పరిరక్షించాలని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురైతే అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కయ్యారనే అపవాదు మూటగట్టుకోవాల్సి వస్తుందని బోయినిపల్లి ప్రవీణ్‌రావు హెచ్చరించారు.



# సైక్లింగ్‌తో ఆరోగ్యం.. పర్యావరణ పరిరక్షణ

**కరీంనగర్ కల్చరల్ ఆగస్టు 29 జనంసాక్షి**

ఆధునిక కాలంలో సైక్లింగ్ క్రీడకు ఆదరణ పెరుగుతోందని, సైక్లింగ్ చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ హానరరీ చైర్మన్, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఊట్కూరి నరేందర్‌రెడ్డి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా సైక్లింగ్ అసోసియేషన్, శాతవాహన లయన్స్ క్లబ్, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'రన్ అండ్ రైడ్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 45 నిమిషాలు శారీరక వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అన్ని వయస్సుల వారు సైక్లింగ్‌ను దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సైక్లింగ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్‌లో



సైక్లింగ్‌పై అవగాహన పెరుగుతోందన్నారు. ముఖ్యంగా యువత సైక్లింగ్‌ను అలవాటుగా చేసుకోవాలని కోరారు. త్వరలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేస్తామని, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.కోర్టు వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆర్అండ్‌బీ చౌరస్తా, తెలంగాణ చౌక్, మంకమ్మతోట, రాంనగర్, టెలిఫోన్ క్వార్టర్స్ మీదుగా డ్యామ్ కట్టపై గేట్ల వరకు కొనసాగింది. కార్యక్రమంలో శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు లయన్ మిట్టపెల్లి మహేందర్, లయన్ నార్ల వేణుగోపాల్, లయన్ మేకల అరవింద్‌బాబు, లయన్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, సైక్లిస్ట్ అఖిల్, లేక్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# దోమకొండ PACS నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం: ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధిఆగస్టు 29, (జనం సాక్షి)**
కామారెడ్డి నియోజకవర్గంలోని దోమకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షట్కర్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

దోమకొండ ఖంఅూ నూతన చైర్మన్‌గా చంద్రయ్యగారి అనంతరెడ్డి ప్రమాణ స్వీకారం చేయగా, నూతన పాలకవర్గ సభ్యులు కూడా తమ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం చైర్మన్ అనంతరెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులను షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ అభినందించారు.

**రైతులకు అండగా పనిచేయాలి**

ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడితేనే గ్రామీణ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.

రైతులకు పంట రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా ఖంఅూలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. సహకార సంఘాలు కేవలం రుణాల పంపిణీకే పరిమితం కాకుండా రైతులకు అవసరమైన అన్ని రకాల వ్యవసాయ సేవలు అందించే కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, రైతు బీమా, సాగునీటి వనరుల అభివృద్ధి వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందని షబ్బీర్ అలీ తెలిపారు. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**కామారెడ్డి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత**

కామారెడ్డి నియోజకవర్గంలో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, వ్యవసాయం తదితర రంగాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని షబ్బీర్ అలీ తెలిపారు. ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.

దోమకొండ ఖంఅూ నూతన చైర్మన్ అనంతరెడ్డిని అభినందించిన షబ్బీర్ అలీ, రైతులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. రాజకీయ భేదాలకు అతీతంగా ప్రతి రైతుకు సమానంగా సేవలందిస్తూ ఖంఅూను మరింత బలోపేతం చేయాలని కోరారు.

**ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం: ఎంపీ షట్కర్**

జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, కొంత ఆలస్యం జరిగినప్పటికీ ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.

రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సామగ్రి సకాలంలో అందేలా ఖంఅూ చైర్మన్లు, పాలకవర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రైతులు చిన్నచిన్న అవసరాల కోసం అధికారుల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా గ్రామస్థాయిలోనే సహకార సంఘాల ద్వారా అవసరమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**భారీగా హాజరైన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు**

ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఇలియాస్, మాజీ డీసీసీబీ/మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, దోమకొండ సర్పంచ్ ఐరేని నరసయ్య, ఆశ పోయిన శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, భీంరెడ్డి, గూడెం శ్రీనివాస్ రెడ్డి, తిరుమల గౌడ్, ఇరేని సందీప్, అంతంపల్లి సుధాకర్ రెడ్డి, అబ్బరబోయిన స్వామి, రామస్వామి గౌడ్, రెడ్డి నాయక్, భూమనీ బాలరాజ్, బల్యాల సుదర్శన్, లింగారెడ్డి, కవిత, నౌసి లాల్ నాయక్, అంకం కృష్ణారావు, శ్రీకాంత్, రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలాగే మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వినీత్, గ్రామ అధ్యక్షులు మధు, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, గోపాల్ రెడ్డి, సిద్ధారం, ఈశ్వర్ గౌడ్, లింగం, సాయిలు, శ్రీహరి, నరేష్ రెడ్డి, శంకర్ రెడ్డి, సంజీవ్, సిద్ధారెడ్డి, బాపురెడ్డి, అంజం, జగ్గారెడ్డి, ముత్తాగౌడ్, నర్సింలు, బాలరాజ్ తదితరులు హాజరయ్యారు.

వివిధ సహకార సంఘాల చైర్మన్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు, గ్రామస్థులు, పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన ఖంఅూ పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.



# గుండ్లపల్లి - పొత్తూరు డబుల్ రోడ్డు పోరు..

## అధికార పార్టీ తీరుపై పెరుగుతున్న ప్రజా వ్యతిరేకత!



**గన్నేరువరం, ఆగస్టు 29 (జనంసాక్షి):**
గన్నేరువరం మండలం గుండ్లపల్లి, పొత్తూరు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం కోసం జరుగుతున్న పోరాటం ఉమ్మడి కరీంనగర్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ, అప్పట్లోని స్థానిక ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను సైతం ఎదిరించి ప్రశ్నించిన అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, నేడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా అదే పట్టుదలతో ముందుకు సాగుతున్నారు.సమస్య మూలాలు – నేపథ్యం: రసమయి బాలకిషన్ ఓటమికి దారితీసిన రోడ్డు సమస్య: గతంలో గుండ్లపల్లి – పొత్తూరు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టడంలో అప్పట్లోని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ విఫలమయ్యారనే అసంతృప్తి ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. ఈ నేపథ్యంలోనే రోడ్డు కోసం ఉద్యమించిన అల్లూరి శ్రీనాథ్ రెడ్డి లాంటి యువ నాయకుల వ్యతిరేకత ఆనాడు రసమయి ఓటమిలో కీలక పాత్ర పోషించింది. మారుతున్న కాలం – మారని దుస్థితి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తమ ప్రాంత దరిద్రం వదిలిపోతుందని ప్రజలు ఆశించారు. కానీ, నేటికీ గుండ్లపల్లి – పొత్తూరు రోడ్డు విషయంలో పాలకులు చూపుతున్న ఉదాసీన వైఖరి చూస్తుంటే, "అరచేతిలో స్వర్గం చూపించి మోసం చేయడమే" అని స్థానికులు మండిపడుతున్నారు.

రేపటి ధర్నా – యువజన సంఘాల రణభేరి: పార్టీలకతీత ఉద్యమం: "నాకు పార్టీల కంటే ప్రజల ప్రయోజనాలే ముఖ్యం. డబుల్ రోడ్డు పనులు జరిగేంత వరకు ఎవరినీ వదిలేది లేదు" అని శ్రీనాథ్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయన సిద్ధాంతానికి మద్దతుగా ఇప్పుడు బీఆర్ఎస్,బీజేపీ, సీపీఐ పార్టీలు కూడా చేతులు కలపడం విశేషం.

గన్నేరువరంమండల కేంద్రంలో ఉద్రిక్తత:
నేడు జరగనున్న ఈ ధర్నా రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. వేలాదిగా యువత, ప్రజలు తరలివచ్చి ప్రభుత్వ తీరును నిలదీయడానికి సన్నద్ధమవుతున్నారు.

పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు:
ఒకే రాష్ట్రం– రెండు విభిన్న నిబంధనలా?
ప్రజా సమస్యలపై, ప్రజాప్రయోజనాల కోసం యువజన సంఘాలు తలపెట్టిన ధర్నాకు అనుమతి ఇవ్వని పోలీసులు, కాంగ్రెస్ అనుబంధ ఎన్ఎస్ యు ఐ ఆధ్వర్యంలో జరిగే చైతన్య ర్యాలీకి మాత్రం పర్మిషన్ ఇవ్వడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ఏసీపీ మాట మార్చడంపై అనుమానాలు:
మొదట అనుమతి ఇస్తామని చెప్పి, చివరి నిమిషంలో ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో కుదరదంటూ ఏసీపీ మాట మార్చడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే పోలీసు యంత్రాంగం పనిచేస్తోందని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

ముగింపు: "పర్మిషన్లిచ్చినా, ఇవ్వకపోయినా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ సమస్యపై వెనకడుగు వేసే ప్రసక్తే లేదు" అని యువజన సంఘాలు తేల్చిచెప్పాయి. ప్రజాస్వామ్యయుతంగా అడుగుతుంటే అణిచివేయాలని చూస్తే, ఉద్యమం మరింత ఉధృతమై అధికార పార్టీకే మునుపటి అనుభవాలు పునరావృతమవుతాయని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# ప్రమాదవశాత్తు కూలిన పాత ఇల్లు..

## త్రుటిలో తప్పిన ప్రాణాపాయం..!!

### ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని బాధితుడి వేడుకోలు

**చిగురుమామిడి ఆగస్టు 29 (జనంసాక్షి):**
శిథిలావస్థకు చేరిన ఒక పాత ఇల్లు పైకప్పు హఠాత్తుగా కూలిపోయి తృటిలో పెను ప్రమాదం తప్పిన ఘటన శనివారం ఉదయం నవాబుపేట గ్రామంలో చోటుచేసుకుంది.బాధితుడు,స్థానికుల వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బోయిని రామయ్య కుటుంబం చాలా ఏళ్లుగా మట్టి గోడలు,పెంకులు,ప్లాస్టిక్ కవర్లతో తాత్కాలికంగా నిర్మించుకున్న పాత ఇంట్లోనే నివాసం ఉంటున్నారు.ప్రతి వర్షాకాలంలో ఈ ఇల్లు నాని ఎప్పుడు కూలుతుందో తెలియని ప్రమాదకర స్థితిలో ఉందని,శనివారం తెల్లవారుజామున దాదాపు 5గంటల సమయంలో రామయ్య నిద్రలేచి బయటకు వెళ్తున్న క్రమంలో ఒక్కసారిగా ఇంటి పైకప్పు భాగం కుప్పకూలిందని తెలిపారు.ఆ పెద్ద శబ్దానికి నిద్రలో ఉన్న కుటుంబ సభ్యులము ఉలిక్కిపడి లేచామని,తమ పక్కనే ఇల్లు పైకప్పు కూలిపోవడంతో తీవ్ర భయాందోళనలకు గురై, ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ఇంట్లో నుండి బయటకు పరుగులు తీసినట్లు చెప్పారు. అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.గతంలో అధికారులకు తమ పరిస్థితిని వివరించామని,ప్రజా పాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి నివాసం మంజూరు కాలేదని బాధితుడు రామయ్య ఆవేదన వ్యక్తం చేశారు.సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు,జీపీఓ శ్రీనివాస్ కూలిపోయిన ఇల్లును పరిశీలించారు.నష్టాన్ని అంచనా వేసి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వారు పేర్కొన్నారు.ప్రస్తుతం ఇల్లు కూలిపోయి నిరాశ్రయులమయ్యామని, ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు,తగిన నష్టపరిహారం అందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు రామయ్య కన్నీటితో వేడుకుంటున్నారు.



# నగరపాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశంలో 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల వినతి

## జీరో అవర్ లో 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ ప్రసంగం

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 29 (జనంసాక్షి) :**
కరీంనగర్ నగరపాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశంలో జీరో అవర్ లో 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆదర్శ్ నగర్ లోని ఖాళీ ఓపెన్ ప్లాట్లలో చుట్టుపక్కల వాడల ప్రజలు, చెత్త తీసుకొచ్చి వాటితోపాటు చికెన్ సెంటర్ల వ్యర్థాలు వేయడంతో తీవ్ర దుర్వాసన వచ్చి స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన కమిషనర్ ఖాళీ ప్లాట్ల యజమానులకు నోటీసులు ఇస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎంహెచ్ఓ గా విధులు నిర్వహిస్తున్న సుమన్ అనే ప్రైవేట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రభుత్వ ఉద్యోగిలా వ్యవహరిస్తూ వోచర్లపై సంతకాలు పెడుతూ, గ్రీన్ పెన్ వాడుతూ అవినీతికి పాల్పడుతున్నాడని, అతన్ని వెంటనే సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ మీ అందరి కోరిక మేరకు పంపిస్తానని హామీ ఇచ్చారు. కౌన్సిల్ మీటింగ్ కు రెవెన్యూ డిపార్ట్మెంట్ నుంచి అర్బన్ ఎమ్మార్వో, హౌసింగ్ నుంచి ఒక డిఈ., ట్రాన్స్ కో నుంచి ఒక డిఈ స్థాయి అధికారిని, అదేవిధంగా ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ నుంచి ఒక అధికారిని పిలిపించి కౌన్సిల్ మీటింగ్ లో ఉంచాలని కోరారు. కరీంనగర్ లో నీటి ఎద్దడి దృష్ట్యా భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, అవసరమైన వారికి రెండో నల్లా కనెక్షన్ ఇవ్వాలని కోరారు. గతంలో రెండో నల్లా కనెక్షన్ ఇస్తుండేవారని, స్పెషల్ ఆఫీసర్ పీరియడ్ లో ఆగిపోయిందని, దాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ సిటీ ద్వారా బిగించిన లైట్లు వెలగడం లేదని, వెంటనే వెలిగించాలని డిమాండ్ చేశారు. వీధి కుక్కలను తీసుకెళ్లి ఆపరేషన్ చేసి మళ్ళీ అదే గల్లీలో వదలడంతో అవి మరింత దూకుడుగా ప్రజల పై దాడి చేస్తున్నాయని, వాటిని వేరే చోటికి తరలించాలని కోరారు. జీరో అవర్ తర్వాత ఎజెండాలోని అంశాలపై మాట్లాడుతూ కొన్ని అంశాలు తప్పుల తడకగా ప్రచురించారని, వాటిని సరి చేయాలని లేకపోతే ముందు ముందు ఇబ్బందులు వస్తాయని ఉదాహరణలతో సభ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ వాటిని సరి చేస్తామని తెలిపారు. స్మార్ట్ సిటీ ద్వారా డీపీర్ తయారు చేసిన అర్వి ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ గురించి ప్రస్తావిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 70 కోట్ల స్మార్ట్ సిటీ నిధుల కోసం కేసీసీల్ తీసుకున్న



నిర్ణయం సీడీఎంఎ ద్వారా ప్రచురించిన అంశంపై గత డీపీర్ లో జరిగిన అవకతవకల గురించి సభ దృష్టికి తీసుకొచ్చారు. డీపీర్ తయారు చేసిన తర్వాత గౌరవ సభ్యులందరి అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. దీనిపై కమిషనర్ వివరణ ఇస్తూ సీడీఎంఎ ద్వారా తీసుకున్న నిర్ణయమని తెలిపారు.



## కరీంపేటలో పౌర హక్కుల దినోత్సవం

### -పాల్గొనని వివిధ శాఖల మండల స్థాయి అధికారులు

### -అంబేద్కర్ సంఘాల నాయకుల అసంతృప్తి

### -అధికారుల తీరు మారకపోతే బహిష్కరిస్తామని హెచ్చరిక

**శంకరపట్నం ఆగస్టు 29 జనంసాక్షి**
కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కరీంపేట గ్రామంలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంటరానితనం, అస్పృశ్యత, కుల వివక్ష నిర్మూలన, సమానత్వం తదితర అంశాలపై అధికారులు, నాయకులు ప్రజలకు అవగాహన కల్పించారు. అయితే కార్యక్రమానికి వివిధ శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కాకపోవడంపై అంబేద్కర్ వాదులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల తీరు మారకపోతే భవిష్యత్‌లో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాలను బహిష్కరించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమం ముగింపు దశలో తహసీల్దార్ కె. సురేఖ పాల్గొని మాట్లాడారు. పౌర హక్కుల దినోత్సవంలో ప్రజా సమస్యల కంటే అంటరానితనం, అస్పృశ్యత, కుల నిర్మూలన వంటి సామాజిక అంశాలపైనే ప్రధానంగా చర్చించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సాయి కృష్ణ, ఆర్ఐ కె. రాములు, సర్పంచ్ ఎగ్గని శ్రీలత, పంచాయతీ కార్యదర్శి సుమన్, అంబేద్కర్‌వాదులు ఆరేపల్లి ఓదెలు, మెరుగు శ్రీనివాస్, రాచమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీఆర్ఎస్ నియోజక ఇంచార్జీ

### అయేషా ఫాతిమా ఆమెర్ జన్మదిన వేడుకలు

**బోధన్, ఆగస్టు 29 ( జనంసాక్షి ) :**
బోధన్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి అయేషా ఫాతిమా ఆమెర్ జన్మదినం



సందర్భంగా శనివారం "గిఫ్ట్ ఏ స్మైల్" కార్యక్రమంలో భాగంగా అమ్దాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి విద్యార్థినీలకు 300 స్కూల్ యూనిఫామ్స్, 100 స్కూల్ బ్యాగులను అందించారు. అనంతరం బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో బాధితులకు పండ్లను అందజేశారు. అలాగే చింతకుంట అనాథ ఆశ్రమంలో వృద్ధులకు నూతన వస్త్రాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బోధన్ పట్టణ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గాండ్ల రవీందర్ యాదవ్ మాట్లాడుతూ, పేదల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించే అయేషా ఫాతిమా మున్ముందు మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని కోరారు. నియోజక వర్గంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం తన స్వంత నిధులతో ప్రజలకు సేవ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ అధ్యక్షుడు గాండ్ల రవీందర్ యాదవ్, మండల అధ్యక్షులు నర్సన్న, సంజీవ్, శ్రీరామ్, భూమారెడ్డి, నర్సింగ్ రావు, కౌన్సిలర్లు మోబీన్, ముషీర్ బాబా, అశోక్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తోట శ్రీనివాస్, శంకర్ గౌడ్, గణేష్, నరేష్, కొప్పర్గ రాములు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేయర్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ధన్ పాల్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 29 జనంసాక్షి :**
నగర మేయర్ కూరగాయల ఉమారాణి తల్లి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ శనివారం కసాబ్ గల్లీ లో గల స్వగృహంలో పరామర్శించారు. ఈ సందర్భంగా మేయర్ తో



పాటు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, మనో ధైర్యాన్ని ఇచ్చారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, మఠం పవన్, పసునూరి రాము, జగదీష్ కులకర్ణి, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## అంజన్న సేవలో దేవాదాయ శాఖ కమిషనర్

**మల్యాల ఆగస్టు 29 (జనం సాక్షి)**
తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ముత్యంపేట గ్రామంలోని కొండగట్టు శ్రీ



ఆంజనేయ స్వామిని శనివారం దేవాదాయ, ధర్మదాయ శాఖ డైరెక్టర్ కమిషనర్ దర్శించుకున్నారు.ఆలయ అధికారులు అర్చకులు కమిషనర్ పూర్ణకుబంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు కమిషనర్ ను శేష వస్త్రంకప్పి సత్కరించి ఆశీర్వదించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారం ఆది రెడ్డి,దేవస్థాన అధికారులు, ప్రధాన అర్చకులు,ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నగర మేయర్, కమిషనర్‌లకు వినతి

**అడగడం మా హక్కు మాత్రమే కాదు - ప్రజలకు సమాధానం చెప్పాల్సిన మా బాధ్యత..**

**7వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నందిని**

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 29 (జనంసాక్షి) :**
గత పాలకవర్గం సమయంలో టెండర్లు తీసుకున్న కొంతమంది కాంట్రాక్టర్లు ఇప్పటికీ పనులు పూర్తి చేయకుండా పెండింగ్‌లో పెట్టారని, అడిగితే పాత బిల్లులు రాలేదని పనులు చేయమని అంటున్నారని 7వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నందిని, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయి లను కోరారు. బిల్లుల సమస్య వారి విషయం కావచ్చు. ప్రజలకు కావాల్సిన అభివృద్ధి పనులను మాత్రం ఆపే హక్కు ఎవరికీ లేదని, ముఖ్యమైన అంశాలను మీ (కౌన్సిల్) దృష్టికి తీసుకురావాలసి వచ్చిందని తెలిపారు. పని చేయని కాంట్రాక్టర్ల విషయంలో కఠిన నిర్ణయం తీసుకోవాలని, పెండింగ్ పనులన్నింటినీ సమీక్షించి, పనులు చేయని కాంట్రాక్టర్ల పై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని, అవసరమైతే బ్లాక్‌లిస్ట్ చేసి, వెంటనే కొత్త టెండర్లు పిలిచి పనులు పూర్తి చేయాలని తెలిపారు. అవినీతి ఆరోపణలు ఉన్న అధికారుల విషయంలో స్పష్టమైన విధానం ఉండాలని, ఒక అధికారి పై అవినీతి ఆరోపణలు వచ్చిన తర్వాత ఆయనను ఒక విభాగం నుంచి మరొక విభాగానికి బదిలీ చేసి, కొద్ది నెలల్లోనే మళ్లీ కీలకమైన పోస్టులోకి తీసుకురావడం ఎంతవరకు సమంజసం అని పేర్కొన్నారు. వ్యక్తిగత విషయాన్ని మాట్లాడటం లేదని, నా ప్రశ్న ఒక్కటే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి పై



విచారణ పూర్తయ్యే వరకు కనీసం బాధ్యతల విషయంలో జాగ్రత్త ఎందుకు తీసుకోకూడదు. ఇష్టబ్లిష్మెంట్, శానిటేషన్ వంటి విభాగాల్లో ఇలాంటి ఆరోపణలు ఉంటే వాటి పై విచారణ జరిపి, నిజం తేల్చాలని, అవినీతికి పాల్పడితే ఎంత పెద్ద వ్యక్తి అయినా చర్యలు తప్పవు అనే నమ్మకం సిబ్బందిలో ఉండాలని, హాస్పిటల్స్ కు ఎన్‌ఓసి లు ఇచ్చే విషయంలో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని, సరైన పార్కింగ్ సదుపాయం లేని హాస్పిటల్స్, అలాగే బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం నిర్వహించని హాస్పిటల్స్ విషయంలో ఎన్‌ఓసి లు ఎలా వస్తున్నాయనే ప్రశ్న ప్రజల్లో ఉందని, మెడికల్ వ్యర్థాలు సాధారణ చెత్తతో కలిస్తే మన డంప్‌యార్డ్‌లో పనిచేసే శానిటేషన్ సిబ్బందికి వాడిన ఇంజెక్షన్ సూదులు, ఇతర ప్రమాదకర వ్యర్థాల వల్ల ఇన్ఫెక్షన్లు, గాయాల ప్రమాదం ఉంటుందని తెలిపారు. అధికారులు స్వయంగా తనిఖీ చేసిన తర్వాతే ఎన్‌ఓసి ఇవ్వాలని, ప్రజల ఆరోగ్యం విషయంలో కాగితాల పై సంతకాలు కాకుండా క్షేత్రస్థాయి పరిశీలన అవసరమని, స్ట్రీట్ లైటింగ్ సామాగ్రి విషయంలో పారదర్శకత కావాలన్నారు. టైమర్లు, పైపులు, క్లాంపులు వంటి చిన్న సామాగ్రి అడిగితే స్టాక్‌లో లేదని, వచ్చినది అయిపోయిందనే సమాధానం వస్తోందని, ప్రతి నెల లైటింగ్ సామాగ్రి ఇండెంట్, వచ్చిన స్టాక్, ఉపయోగించిన స్టాక్, మిగిలిన స్టాక్ వివరాలను కార్పొరేటర్లకు ఇవ్వాలని, 7వ డివిజన్‌లో శానిటేషన్ సిబ్బందిని పెంచాలని హౌసింగ్ బోర్డ్ కాలనీ, సదాశివపల్లి కలిపి మా డివిజన్ విస్తీర్ణం చాలా పెద్దదని, ప్రస్తుతం ఉన్న సిబ్బంది సరిపోవడం లేదని, పై అంశాల పై స్పష్టమైన నిర్ణయం, కాలపరిమితితో కూడిన చర్య తీసుకోవాలని కోరుతున్నానని 7వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నందిని తెలిపారు.

## తుక్కోజీవాడిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**సదాశివనగర్ ఆగస్టు 29 (జనంసాక్షి):**
సదాశివనగర్ మండలంలోని తుక్కోజీవాడి గ్రామపంచాయతీ కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొడ్ల సంగారావు, ఉపసర్పంచ్ రాజయ్య, పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# అంగన్వాడి కేంద్రాలకు విద్యుత్ వెలుగులు

**○379 కేంద్రాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు.. ○చిన్నారులకు మెరుగైన వసతులే లక్ష్యం: ఎస్ఈ రవీందర్**

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 29 (జనంసాక్షి)** చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్వాడి కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ఎన్పీడీసీఎల్ ప్రత్యేక చర్యలు చేపట్టిందని కరీంనగర్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఆర్. రవీందర్ తెలిపారు. సర్కిల్ పరిధిలోని మొత్తం 379 అంగన్వాడి కేంద్రాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు అందించినట్లు వెల్లడించారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు ప్రీ-స్కూల్ కార్యకలాపాలు, ఆటలు, అభ్యసన కార్యక్రమాలు, పోషకాహార పంపిణీ, ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందుకు విద్యుత్ సౌకర్యం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్ఈ పేర్కొన్నారు. విద్యుత్ కనెక్షన్లు అందుబాటులోకి రావడంతో అంగన్వాడి కేంద్రాల్లో ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి మోటార్లు, ఇతర విద్యుత్ పరికరాలను సక్రమంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. దీంతో వేసవి వేడి, ఉక్కపోత వంటి ఇబ్బందులు లేకుండా చిన్నారులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యా, అభ్యసన కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కలుగుతుందని తెలిపారు. అంగన్వాడి కార్యకర్తలు తమ విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కూడా విద్యుత్ సౌకర్యం దోహదపడుతుందని రవీందర్ అన్నారు. చిన్నారులకు పోషకాహారం తయారీ, తాగునీటి సదుపాయం, పరిశుభ్రత, ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.



చిన్నారుల సంక్షేమం, విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ అంగన్వాడి కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడాన్ని ఎన్పీడీసీఎల్ సామాజిక బాధ్యతగా భావిస్తోందని ఎస్ఈ తెలిపారు. సర్కిల్ పరిధిలోని ప్రతి అంగన్వాడి కేంద్రం విద్యుత్ వెలుగులతో కళకళలాడేలా అవసరమైన చర్యలు కొనసాగిస్తున్నామని వెల్లడించారు.



## జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు సన్మానం

**చొప్పదండి ,ఆగస్టు 29 (జనంసాక్షి ):**
జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని చొప్పదండి లయన్స్ క్లబ్ అద్యక్షులు వల్లాల జగన్ అద్వర్యంలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో ప్రథమ స్థానం పొంది మధ్యప్రదేశ్లోని ఇండోర్లో జరిగేటువంటి జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులను చొప్పదండి లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన డిస్ట్రిక్ట్ క్యాబినేట్ సెక్రటరీ, కోశాధికారి కొల్లూరి ఆనందం, వల్లాల క్రిష్ణహరి లు మాట్లాడుతుతైక్వాండో పోటిలో రాష్ట్రస్థాయిలో ఎంపికైనా బుసారపు వెంకటేష్, మల్లేష్ విద్యార్థులను అభినందినీయమని మునుముందు ప్రపంచస్థాయి పోటిలో ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం కోచ్ శ్రీ గాద సంతోష్ సన్మానించారు కార్యక్రమంలోఅద్యక్షులు వల్లాల జగన్ సెక్రటరీ దూస రాము, కోశాధికారి సిరిపురం రాజుడిస్ట్రిక్ట్ మైక్రో మెంబర్స్ పెద్ది లక్ష్మికాంతం, తొడుపునూరి లక్ష్మయ్య, చింతల రవి, తొడుపునూరి సత్యనారాయణ, నలుమాచు సుధాకర్ కోడూరి క్రిష్ణమూర్తి, కోచ్ శ్రీగాద సంతోష్, విద్యార్థులు ప్రహర్ష , స్పందన సౌమ్య , శ్రీ వాత్సవ్ , శివశంకర్ , రామ్ చరణ్ , జిల్లా కోచ్ లు నాగమణి , అంజలి , రమ్య పాల్గొన్నారు.

# డంప్ యార్డ్ లో చెత్త గుట్టలు తగ్గడం లేదు

**○కొందరు అధికారుల, ప్రజా ప్రతినిధుల ఇళ్లలో నోట్ల కట్టల గుట్టలు పెరుగుతున్నాయి**
**○కరీంనగర్ డంప్యార్డ్ను వెంటనే తరలించాలి**
**○నగర ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ పాలకులకు పట్టింపు లేదు**
**○తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్**

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 29 (జనంసాక్షి) :** డంపింగ్ యార్డ్ తరలించాలని శనివారం రోజు కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాలయం ముందు తెలంగాణ రక్షణ సేన జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించాడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ... కరీంనగర్ నగర ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర ఇబ్బందిగా మారిన డంప్యార్డ్ను వెంటనే నగరానికి దూరంగా తరలించాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో కరీంనగర్ మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించినట్లు తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు. ప్రతి రోజు వివిధ డివిజన్ల నుండి దాదాపు నూట యాభై మెట్రిక్ టన్నుల చెత్త వస్తుంది. ఇప్పటికే డంపింగ్ యార్డ్ లో నాలుగున్నర లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయి ఉంది. పరిసర ప్రాంత ప్రజలతో పాటు కరీంనగర్ లో సగం భాగం ప్రజలు దుర్వాసన, పొగ, దోమలు, కాలుష్యం వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. మా పాలన వర్గం అధికారం చెపట్టితే వెంటనే డంప్యార్డ్ సమస్య తీరుస్తాం అని కేంద్ర మంత్రులు చెప్పినప్పటికీ డంపింగ్ యార్డ్ మాత్రం శాశ్వత పరిష్కారం ఇంకా చూపలేక పోతున్నారని వారు పేర్కొన్నారు. చెత్తను శాస్త్రీయ పద్ధతిలో బయో మైనింగ్ ద్వారా తొలగించే ప్రక్రియ ఏమైందని ఇప్పటికే దాదాపు ఇరవై ఐదు కోట్ల రూపాయల ప్రజాధనాని దుర్వినియోగం చేసినారు. శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యర్థాల నిర్వహణను పారిశుధ్య వ్యవస్థ పని చెయ్యకుండా పోయిందని తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేసింది. నగర ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం తెలంగాణ రక్షణ సేన ఆద్వర్యంలో రానున్న రోజుల్లో మరిన్ని పోరాటాలు చేస్తామని జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ లింగంపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి మేకల తిరుపతి, మానకొండూరు నియోజకవర్గం ఇన్చార్జి చెన్నమల్ల చైతన్య, బీసీ విభాగం అధ్యక్షులు శ్రీరాముల రమేష్, ఆదివాసి విభాగం అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్, సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, బాసవేణి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ఉన్నత విద్య లేకపోయినా.. ఉన్నతమైన ఆలోచన

**విద్యార్థుల కోసం స్వంత నిధులతో పిచికారి చేసిన వార్డు మెంబర్**

ఎడపల్లి, ఆగస్టు 29 ( జనంసాక్షి ) : ఆ వార్డు మెంబర్ ఉన్నత చదువులు చదవలేదు అయితే తన ఉన్నతమైన ఆలోచనతో



ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులు తన స్వంత కూతుళ్లుగా భావించి దోమల బెడద నుండి వారిని కాపాడారు. ఇక వివరాల్లోకి వెళితే ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల చుట్టు పక్కల మొత్తం పిచ్చి మొక్కలు, గడ్డి మొక్కలు విపరీతంగా పెరిగాయి. అయితే ఈ విషయంలో అటు పంచాయితీ అధికారులు ఇటు సంబంధిత ప్రజాప్రతినిధి గానీ పట్టించుకున్న పాపాన పోలేదు. దాంతో స్పందించిన 4వ వార్డు మెంబర్ సాయి (చిరు) వెంటనే స్పందించి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం తన స్వంత డబ్బులతో దోమల మందును పిచికారి చేయించి మానవత్వాన్ని చాటారు. సదరు వార్డు మెంబర్ సాయి విద్యార్థుల కోసం చేసిన ఈ పనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అసోసియేషన్ పరిధిలో సిసి కెమెరాల ప్రారంభోత్సవం

**ముఖ్యఅతిథిగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 29 (జనంసాక్షి) :**
కరీంనగర్ లోని 50వ డివిజన్ జ్యోతినగర్ రోడ్ నెం.1 లో 'మహాత్మా స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియోషన్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సి.సి. కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పాల్గొని రిబ్బన్ కట్ చేసి సీసీ కెమెరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అనేది ఎవరో చెప్పారని కాకుండా, మన స్వంత భద్రత, మన పిల్లల రక్షణ, పరిసరాల సేఫ్టీ కోసమేనని స్పష్టం చేశారు. ఒక్క సీసీ కెమెరా దాదాపు వంద మంది పోలీసులతో సమానమని, ఇది నేరం జరిగిన తర్వాత నిందితులను పట్టుకోవడానికే కాకుండా, అసలు నేరం జరగకుండా నిరోధించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ద్వారా నగరంలో ప్రధాన రహదారులపై దాదాపు వెయ్యి హై-రెజల్యూషన్ సిసి కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్కు అనుసంధానించడం జరిగిందనీ తెలిపారు. 360 డిగ్రీల్లో రాత్రి, పగలు రికార్డు చేసే ఈ కెమెరాల వల్ల నగరంలో భద్రత మెరుగైందన్నారు. ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ప్రజలు బాధ్యతగా భావించి ఇళు ్లు, వ్యాపార సముదాయాలు, కాలనీల వీధుల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, టూ టౌన్ సిఐ సృజన్ రెడ్డి, ఏసిపి వెంకటస్వామి, కార్పొరేటర్స్ ఎన్నం ప్రకాష్, కర్ర అనిల్, కో.ఆప్షన్ సభ్యులు బల్వీర్ సింగ్, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం..

## బీఆర్ఎస్ నేతలు తోట ఆగయ్య, రవీందర్‌రావు




గంభీరావుపేట, ఆగస్టు 29: (జనంసాక్షి); రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ నేతలు తోట ఆగయ్య, రవీందర్‌రావు హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వారు ఆరోపించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత, అసంతృప్తి పెరిగిపోయిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు 1000 రోజులు కావస్తున్నా హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మహిళలకు నెలకు రూ. 2,500, రైతులకు రైతుబంధు రూ. 15 వేల వంటి హామీలు అమలు కాలేదన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు తులం బంగారం హామీని కూడా నెరవేర్చలేదని అన్నారు. 2 లక్షల ఉద్యోగాల హామీని పక్కనపెట్టి పాత నోటిఫికేషన్లనే కొత్తగా చూపిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో కేసీఆర్ కిట్, అమ్మఒడి వంటి పథకాలతో పేద కుటుంబాలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. ప్రజా సంక్షేమంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల మదిలో నిలిచిపోయాయని పేర్కొన్నారు. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపివేయాలని ప్రయత్నించినా ప్రజల గుండెల్లో ఆయనకు ఉన్న ఆదరణను తొలగించలేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. హామీల అమలు కోసం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువత ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1 నుంచి చేపట్టే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



కరీంనగర్, క్రైమ్ ఆగస్టు 29(జనంసాక్షి ) : కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 21-08-2026 జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ (29-08-2026) మృతి చెందినట్లు రూరల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎ. నిరంజన్ రెడ్డి తెలిపారు. 21-08-2026న మధ్యాహ్నం సమయంలో చొప్పదండి మండలం చిట్యాలపల్లికి చెందిన నడిపెల్లి మధుసూదన్ రావు తన బెలోనా కారును నడుపుతూ, అతనితో పాటు శ్రీహరి రావు ముందు సీటులో కూర్చొని కరీంనగర్ వైపు పనిమీద వెళ్తున్నారు. తీగలగుట్టపల్లి నుంచి ఆరేపల్లి వెళ్లే రహదారిపై రోడ్డు పక్కన ఒక ట్రాక్టర్ ఉండగా, కారు డ్రైవర్ మధుసూదన్ రావు వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో ట్రాక్టర్ పక్కనుంచి వెళ్లే సమయంలో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముందు సీటులో కూర్చున్న బల్మూరి శ్రీహరి రావు (68) వయస్సు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నగునూరులోని ప్రతిభ మెడికల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.( 29-08-2026 ) (10:30) గంటల సమయంలో చికిత్స పొందుతున్న శ్రీహరి రావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు బల్మూరి లక్ష్మీ నరసింహారావు కుపోలీసులకు సమాచారం అందించడంతో, మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకుని మృతదేహంపై పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుడి కుమారుడు లక్ష్మీనరసింహారావు, అప్పగించారు. మృతుడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎ. నిరంజన్ రెడ్డి తెలిపారు.

# చిగురుమామిడి రైతువేదికలో రైతులకు ఆత్మ శిక్షణ కార్యక్రమం

## ముఖ్యఅతిథిగా హాజరైన ఆత్మ పిడి చత్రునాయక్..

చిగురుమామిడి ఆగస్టు 29 (జనంసాక్షి): మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం రైతులకు ఆత్మ- ఆర్ పిఎల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి సాగులో ఆధునిక పద్ధతులు, తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమం జరిగిందని వ్యవసాయ శాఖ మండల అధికారి తాటిపల్లి పున్నమి చందర్ రెడ్డి తెలిపారు. ఈ శిక్షణలో ముఖ్య అతిథిగా ఆత్మ పిడి చత్రు నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వరి పంటలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అందించే 7రకాల సన్న రకాల వంగడాల గురించి రైతులకు వివరించారు. వరి సాగులో శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, కాలానుగుణంగా వచ్చే పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. మరో ముఖ్య వక్త, బి.జె.ఆర్ అగ్రికల్చర్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, శాస్త్రవేత్త శ్రీ హరికృష్ణ మాట్లాడుతూ వరి పంటలో నాణ్యమైన దిగుబడులు సాధించడానికి పంట దశల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సన్న రకాల ఎంపిక, శాస్త్రీయ ఎరువుల యాజమాన్యంపై రైతులకు దిశానిర్దేశం చేశారు. పంటలను ఆశించే పురుగులు, తెగుళ్లను ముందుగానే గుర్తించి, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని ఆయన సూచించారు. అనంతరం రైతులు అడిగిన పలు సందేహాలను అధికారులు, శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా వరి పంటలో అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తి, మెరుగైన ఆదాయాన్ని సాధించవచ్చని అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిగురుమామిడి గ్రామ సర్పంచ్ ఆకవరం భవాని, మండల వ్యవసాయ శాఖ అధికారి పున్నం చందర్ రెడ్డి, ఏఈఓ అర్చన, వ్యవసాయ విస్తరణ అధికారులు, చిగురుమామిడి మండల పరిధిలోని పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.






# ఎంసీఏలో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం

కరీంనగర్ కల్చరల్ ఆగస్టు 29 (జనం సాక్షి) శాతవాహన విశ్వ విద్యాలయం యూని వర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో 2026?27 విద్యా సంవత్సరానికి ఎంసీఏ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రమాకాంత్ తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాల ప్రకారం సెప్టెంబర్ 2న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని పేర్కొన్నారు. తెలంగాణ సమగ్ర ఉమ్మడి ప్రవేశ పరీక్ష?2026లో అర్హత సాధించిన, సాధించని అభ్యర్థులు కూడా ఈ స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావచ్చని తెలిపారు. ఎంసీఏలో ఇప్పటివరకు ప్రవేశం పొందని అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఒక సెట్ జిరాక్స్ కాపీలు, అవసరమైన ఫీజుతో హాజరుకావాలని సూచించారు. తుది ఖాళీల వివరాలు, ప్రవేశానికి సంబంధించిన మార్గదర్శకాలు తెలంగాణ సమగ్ర ఉమ్మడి ప్రవేశ పరీక్ష అధికారిక వెబ్‌సైట్‌లో, అలాగే శాతవాహన విశ్వవిద్యాలయం నోటీస్ బోర్డులో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు శాతవాహన విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 7207777664 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మామిడిపల్లి జెడ్ పి హెచ్ ఎస్ విద్యార్థులు



నిజామాబాద్ స్పోర్ట్స్ ఆగస్టు 29 జనంసాక్షి : వ ం డ ల ం లో ని మామిడిపల్లి ఉన్నత పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ కూన లతా సాగర్ సోమవారం అభినందించారు. జిల్లా స్థాయి శిక్షణ శిబిర ఎంపికల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఎన్. సాత్విక, డీ. నిత్యశ్రీ, ఆర్. విశాల్, కే. లక్షిత్‌లను పాఠశాల సిబ్బందితో కలిసి సత్కరించారు. శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబరిచిన ఇద్దరు క్రీడాకారులు కూన లక్షిత్ నందిగామ, సాత్వికరాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ కూన లతా సాగర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మాక్లూర్ మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు కైరంకొండ బాబు మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు పాఠశాల తరఫున అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు వీ. భారతి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమం తప్పకుండా సాధన చేయడం, కష్టపడి శ్రమించడం వల్లే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. రాబోయే పోటీల్లో మరింత మెరుగైన ప్రదర్శన ఇచ్చేలా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తామని చెప్పారు. తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయురాలు వీ. భారతిని కూడా సర్పంచ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తరిగొప్పుల చిరంజీవి, కూన సాగర్, భోజేందర్, లింగన్న, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ పై విద్యార్థులకు వర్క్ షాప్

చొప్పదండి ,ఆగస్టు 29 (జనం సాక్షి): చొప్పదండి పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9 నుండి 12వ తరగతి విద్యార్థులకు 'డిజైన్ థింకింగ్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) బాధ్యతాయుతమైన ఉపయోగం' అనే అంశంపై శనివారం ఒక రోజు కెరీర్ గైడెన్స్ వర్క్‌షాప్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌లోని ప్రసిద్ధ సిబిఐటి (అటా) కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కె. రామకృష్ణ ముఖ్య వక్తగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ.. 12వ తరగతి (ఇంటర్మీడియట్) తర్వాత విద్యార్థుల ముందున్న వివిధ రకాల సరికొత్త కెరీర్ అవకాశాలను వివరించారు. సరైన కెరీర్ ప్లానింగ్ ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను ఎలా అధిరోహించవచ్చో ఉదాహరణలతో తెలియజేశారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాధాన్యతను వివరిస్తూనే, దానిని బాధ్యతాయుతంగా ఎలా ఉపయోగించుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సెషన్‌లో భాగంగా ప్రొఫెసర్ విద్యార్థులకు 'ప్రాబ్లమ్ సాల్వింగ్' (సమస్యల పరిష్కారం) నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. విద్యార్థులతో నేరుగా ముఖాముఖి నిర్వహించి, సమాజంలో ఎదురయ్యే పలు సమస్యలకు తమ వినూత్న ఆలోచనలతో ఎలాంటి పరిష్కారాలు చూపవచ్చో ప్రాక్టికల్‌గా వివరించారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు ఆయన ఓపిగ్గా సమాధానాలిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ కె. బ్రహ్మానంద రెడ్డి , ఇతర ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.

## బీబీపేట్ ప్రజలకు శుభవార్త.. ఎన్‌హెచ్-44పై ఫ్లైఓవర్‌కు సానుకూల స్పందన

### త్వరలో సర్వే.. సాంకేతిక పరిశీలన అనంతరం నిర్మాణ పనులకు శ్రీకారం: ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధిఆగస్టు 29, (జనంసాక్షి)**
దోమకొండ, బీబీపేట్ మండలాలతో పాటు పరిసర గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఎన్‌హెచ్-44పై ఫ్లైఓవర్ నిర్మాణానికి సానుకూల స్పందన లభించింది. బేసిక్ ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మించాలని స్థానిక ప్రజలు చేసిన విజ్ఞప్తిపై ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మహమ్మద్ అలీ షబ్బీర్, ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో కలిసి ఎన్‌హెచ్-44లోని బేసిక్ ప్రాంతాన్ని సందర్శించారు. ఫ్లైఓవర్ నిర్మించాల్సిన ప్రదేశాన్ని పరిశీలించి, జాతీయ రహదారిని దాటే సమయంలో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దోమకొండ, బీబీపేట్ మండలాలు, పరిసర గ్రామాల ప్రజలు నిత్యం ఎన్‌హెచ్-44ను దాటాల్సి వస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని నాయకులు తెలిపారు. ప్రజల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని బేసిక్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను కోరారు. దీనిపై స్పందించిన ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఫ్లైఓవర్ నిర్మాణ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించారు. త్వరలో సంబంధిత ప్రాంతంలో సర్వే నిర్వహించి, రహదారి పరిస్థితులు, ట్రాఫిక్ రద్దీ, సాంకేతిక అంశాలను పరిశీలించిన అనంతరం నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే దోమకొండ, బీబీపేట్ మండలాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ఎన్‌హెచ్-44ను దాటేందుకు ఎదురయ్యే ఇబ్బందులు తగ్గడంతో పాటు ప్రయాణ సమయం తగ్గుతుందని, ప్రమాదాల నివారణకు మరియు రహదారి భద్రతకు కూడా ఇది దోహదపడుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, దోమకొండ-బీబీపేట్ ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

## భిక్కనూరు సిద్ధార్థ విద్యాలయం జోనల్ టోర్నమెంట్ లో ప్రతిభ



**భిక్కనూరు ఆగస్టు 29 (జనంసాక్షి):**
భిక్కనూరు మండల కేంద్రంలో గల సిద్ధార్థ విద్యాలయం విద్యార్థులు ఇటీవల దోమకొండ పోర్టు అండ్ విలేజ్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భిక్కనూరు,దోమకొండ, బిబిపేట్, మండల స్థాయిలో నిర్వహించిన జోనల్ టోర్నమెంట్ లో భిక్కనూరు సిద్ధార్థ విద్యాలయం విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచారు, అండర్‌బి16 బాలుర కారమ్స్ విభాగంలో 10వ తరగతి విద్యార్థులు వీరబత్తిని నిశాంత్,ద్యాగాల అజయ్ కుమార్ ప్రథమ బహుమతి సాధించారు, ఇటీవల కూడా సిద్ధార్థ విద్యాలయంకు చెందిన పదవ తరగతి విద్యార్థిని తొలుకుల అనూష జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలో 100 మీటర్ల పరుగు విభాగంలో ప్రథమ బహుమతి,600 మీటర్ల విభాగంలో తృతీయ బహుమతి సాధించారు, ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బండి సుధాకర్ మాట్లాడుతూ ఇటీవల మరో10వ తరగతి విద్యార్థి డిస్కస్ త్రోలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన విషయాన్ని వారు గుర్తు చేశారు, ఈ క్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని, విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందిస్తూ వారిని ప్రోత్సహించి భవిష్యత్తులో మంచి క్రీడాకారులు గా తీర్చిదిద్దాలని విద్యార్థులను అభినందిస్తూ సూచించారు, జోనల్ స్థాయిలో ప్రతిమ బహుమతి సాధించిన విద్యార్థులను పాఠశాల పి,ఈ,టి,బీరయ్య పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది, క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు ఆరోగ్యం ఏకాగ్రత క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం పెరుగుతాయి అని విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం వివరించారు అంతేకాకుండా క్రీడలు విద్య రెండింటికి సమాన ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులను అన్ని రంగాల్లో ముందు ఉండేలా తీర్చిదిద్దుదామని పాఠశాల యాజమాన్యం తెలిపారు.

## కోర్కల్ లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీలను అందచేసిన సర్పంచ్ పూదరి రమ్యకృష్ణ అనిల్

**వీణవంక ఆగస్టు 29(జనం సాక్షి)**
వీణవంక మండలంలోని కోర్కల్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం రోజున నిర్వహించిన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ ఇండ్ల మంజూరు చేసినందుకు సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలుపుతూ త్వరగా ఇండ్ల నిర్మాణం పనులు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్,వార్డు సభ్యులు,కార్యదర్శి,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో క్రీడలను ప్రోత్సహించాలి

### ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో క్రీడల పాత్ర కీలకం: అదనపు కలెక్టర్ విక్టర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధిఆగస్టు 29 (జనంసాక్షి)**
మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని శనివారం దోమకొండ కోటలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దోమకొండ విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, మేజర్ ధ్యాన్‌చంద్ దేశానికి అందించిన క్రీడా సేవలు, ఆయన సాధించిన విజయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను, పట్టుదలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువతలో క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, యువత తమలోని క్రీడా ప్రతిభను వెలికితీసుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం క్రీడలకు కేటాయించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, యువతీ యువకులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో దోమకొండ ట్రస్ట్ ప్రతినిధి కామినేని అనిల్, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి రంగ వెంకటేశ్వర్ గౌడ్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, దోమకొండ కోట మేనేజర్ బాబ్జీ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీధర్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, యువతీ యువకులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వార్డుకు రూ.6 లక్షల అభివృద్ధి నిధులు

### కామారెడ్డి మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశంలో 9 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం

**కామారెడ్డి, జిల్లా ప్రతినిధిఆగస్టు 29( జనంసాక్షి)**
పట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ కామారెడ్డి పురపాలక సంఘ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్.వై. గిరి సూచించారు.
శనివారం కామారెడ్డి పురపాలక సంఘ సమావేశ మందిరంలో ఆగస్టు నెలకు సంబంధించిన అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పురపాలక సంఘ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, వైస్ చైర్మన్ కాసర్ల గోదావరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మొత్తం 9 ఎజెండా అంశాలను కౌన్సిల్ సభ్యుల ముందుంచి విస్తృతంగా చర్చించారు. ఎజెండాలోని అన్ని అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

**వార్డుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు**
అత్యవసర సమావేశంలో భాగంగా కామారెడ్డి పురపాలక సంఘంలోని ప్రతి వార్డుకు రూ.6 లక్షల చొప్పున అభివృద్ధి నిధులు కేటాయించే ప్రతిపాదనను ప్రవేశపెట్టారు. ఆయా వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఈ నిధులను వినియోగించనున్నారు. ఈ ప్రతిపాదనకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

**ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు**
ఈ సందర్భంగా అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్.వై. గిరి మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. ప్రతి




వార్డులో ప్రజల అవసరాలను గుర్తించి, అత్యవసరత మరియు ప్రాధాన్యత ఆధారంగా పనులను ఎంపిక చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
అభివృద్ధి పనుల అమలులో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పురపాలక సంఘ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.

ఈ సమావేశంలో పురపాలక సంఘ కమిషనర్, కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, డిప్యూటీ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ అధికారి, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.





## భక్తులతో కిటకిటలాడిన నరసింహస్వామి ఆలయం

**రుద్రంగి ఆగస్టు 29 (జనంసాక్షి)**

రుద్రంగిలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం శ్రావణ మాస శనివారం సందర్భంగా భక్తులతో కిక్కిరిసిపోయింది. రుద్రంగిలో ఒక ఆనవాయితీ ఉంది - శ్రావణ పౌర్ణమి తర్వాత వచ్చే శనివారం, బుధవారం రోజుల్లో స్వామివారికి బియ్యం సమర్పించడం ఇక్కడ అనాదిగా వస్తున్న ఆనవాయితీ ఆచారం ఇట్టి కార్యక్రమాన్ని భక్తులు చాలా పుణ్యప్రదంగా భావిస్తారు. అందుకే ఈ సంప్రదాయాన్ని పాటిస్తూ భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చారు.

భక్తులు స్వామివారిని దర్శించుకుని, తాము తెచ్చిన బియ్యాన్ని స్వామివారికి సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ సామ మోహన్ రెడ్డి దగ్గరుండి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

## సింగీతం రిజర్వాయర్, నర్వ పాత చెరువు మరమ్మతులకు రూ.1.31 కోట్ల నిధులు



**జనం సాక్షి - నిజాంసాగర్:**

మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని ప్రధాన జలవనరు సింగీతం రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్ మరమ్మతులకు రూ. 83.50 లక్షలు, నర్వ పాత చెరువు పంట కాలువ మరమ్మతులకు రూ. 48 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయకట్టు ప్రాంత రైతుల సమస్యలను పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేయించడంలో కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మహమ్మద్‌నగర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చిత్రపటాలకు కృతజ్ఞతా భావంతో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, రైతులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. సింగీతం రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్ మరమ్మతులకు నిధులు మంజూరు కావడంతో రిజర్వాయర్ భద్రతకు తోడ్పాటు లభించడంతో పాటు ఆయకట్టు రైతులకు ప్రయోజనం కలుగుతుందని వారు పేర్కొన్నారు. అలాగే నర్వ పాత చెరువు పంట కాలువ మరమ్మతులతో సాగునీటి సరఫరా మరింత మెరుగుపడి రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మహమ్మద్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయకట్టు ప్రాంత రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సోదర సోదరీమణుల ప్రేమానుబంధాలకు రక్షాబంధన్ ప్రతీక: మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణి శ్రీనివాస్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధిఆగస్టు 29 (జనం సాక్షి)**

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ సహచర కాంగ్రెస్ కౌన్సిలర్లతో కలిసి రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లకు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ, రక్షాబంధన్ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కుటుంబాల్లో సోదర సోదరీమణుల మధ్య ప్రేమానుబంధాలు ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షించారు. వేడుకల్లో కౌన్సిలర్లు అంజాద్, బబ్లు, మాజీద్, జావేద్, సాయిలు సిద్ధిక్, చిట్టిబాబు, కళ్లెం సత్యం, యూనస్, అస్రార్ తదితరులు పాల్గొన్నారు.



## సన్న వరి సాగు రైతులకు వ్యవసాయ అధికారి సూచన

**రుద్రంగి ఆగస్టు 29 (జనం సాక్షి)**

వానాకాలం సీజన్ లో సన్న వరి సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా విత్తన కొనుగోలు బిల్లు లేదా స్వీయ ప్రకటన పత్రాన్ని 09-09-2026 లోపు సమర్పించాలని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. కేఎన్ఎం-1638, కేఎన్ఎం-7715, ఆర్ఎన్ఆర్-15048, హెచ్ఎంటి సోనా, జై శ్రీరామ్, డబ్ల్యూజీఎల్-44, బీపీటీ-5204 వంటి సన్న వరి రకాలు సాగు చేస్తున్న రైతులకు ఈ నిబంధన వర్తిస్తుందని అధికారి పేర్కొన్నారు. విత్తనం కొనుగోలు చేసిన రైతులు తమ డీలర్ వద్దకు వెళ్లి సన్న వరి రకం పేరు చెప్పి బిల్లు తీసుకోవాలని, డీలర్ ఆ వివరాలను రికార్డులో నమోదు చేస్తారని తెలిపారు. పంట కొనుగోలు సమయంలో ఈ బిల్లు తప్పనిసరి అని స్పష్టం చేశారు. సొంత విత్తనం లేదా విశ్వవిద్యాలయ విత్తనం వాడిన రైతులు బిల్లు లేని పక్షంలో స్వీయ ప్రకటన పత్రం రాసి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి అందజేయాలని సూచించారు. అర్హత గల రైతులందరూ గడువు లోపు పత్రాలు సమర్పించి ప్రభుత్వ పథకాలకు అర్హత పొందాలని రుద్రంగి వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోతి రైతులను కోరారు.






## కృష్ణవేణిలో ఘనంగా గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు

**రుద్రంగి, ఆగస్టు 29: (జనంసాక్షి):**

రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి హై స్కూల్ లో గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు, తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ హరినాథ్ రాజ్ మాట్లాడుతూ, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు. తెలుగు భాష గొప్పతనాన్ని, గిడుగు రామ్మూర్తి చేసిన కృషిని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్లు తీపిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎర్రం గంగ నరసయ్య, పడాల సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం

### వేములవాడలో సెప్టెంబర్ 26 నుండి 29 వరకు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 29 (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, వేములవాడలో సెప్టెంబర్ 26 నుండి 29 వరకు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సెప్టెంబర్ 26, 27, 28, 29 వరకు వేములవాడలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల నిర్వహించడం జరుగుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలు, హైదారాబాద్ లోని మరో జట్టుకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారన్నారు. బాయ్స్ 34 జట్లు, గర్ల్ 34 జట్లు పోటీలలో పాల్గొంటాయని, సుమారు 1358 మందితో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల నిర్వహిస్తున్నమన్నారు. గత కొద్ది రోజుల క్రితం వేములవాడలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించుకున్నమని, సీఎం రేవంత్ రెడ్డి యువత క్రీడా మైదానంలో ఎక్కువగా గడపలనీ కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్న మని, ఒక పండుగ వాతావరణంలో కబడ్డీ క్రీడా పోటీలను నిర్వ హించడం జరుగుతుందన్నారు. జాతీయ స్థాయి లో రాణించేలా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల నిర్వహణఉంటుందని, క్రీడాకారు లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటమ న్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడల్లో పాల్గొననాలని, సీఎం రాష్ట్రంలో ఉన్న యువత, క్రీడాకారులు రానున్న రోజుల్లో ఒలంపిక్ లో ఆడేల సీఎం కప్ నిర్వహిం చారన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకొని కమిటీలు వేసుకొని ముందుకు పోతమన్నారు .కబడ్డీ క్రీడా పోటీలకు రాష్ట్ర మంత్రులు శ్రీహరి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు హాజరవుతారన్నారు. ప్రతి ఒక్కరికి సలహాలు సూచనలు తీసుకొని ముందుకు పోతమని, రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ పుల్కాం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కౌన్సిలర్ తూము మధు, కౌన్సిలర్లు, రాష్ట్ర కబడ్డీ సంఘం వైస్ ప్రెసిడెంట్ సంపత్ రావు, జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా సెక్రెటరీ తిరుపతి, కబడ్డీ క్రీడాకారులు, క్రీడాభిమానులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## వరి పంటలో వచ్చు తెగులు, మొగిపురుగు నివారణకు సూచనలిచ్చిన మండల వ్యవసాయ అధికారి

**మేడిపల్లి,ఆగస్టు 29 (జనంసాక్షి ):**

జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం పొరుమల్ల గ్రామంలో వరి పంటలను మండల వ్యవసాయ అధికారి ఎం.డి. షాహిద్ అలీ పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంటలో హిస్పా, మొగిపురుగుల ఉధృతి, పంట పరిస్థితిని పరిశీలించి రైతులకు తగిన సూచనలు చేశారు.

**హిస్పా నియంత్రణకు:**

పొలంలో కలుపు మొక్కలను తొలగించి, పొలం గట్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అవసరానికి మించి నత్రజని ఎరువుల వినియోగాన్ని నివారించాలని, పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు లంబ్డ సైహలోత్రిన్ లేదా ఇమిడక్లోప్రిడ్ మందును పురుగుమందులను మాత్రమే లేబుల్ సూచనల ప్రకారం ఉపయోగించాలని రైతులకు వివరించారు.

**మొగిపురుగు నియంత్రణకు:**

పంటను క్రమం తప్పకుండా పరిశీలించి డెడ్ హార్ట్స్ లక్షణాలను గుర్తించి, పొలంలో పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు సిఫారసు చేసిన పురుగుమందులను సరైన మోతాదులో పిచికారీ చేయాలన్నారు. సాధ్యమైన చోట ఫెరోమోన్ ట్రాప్స్ మరియు ఇతర సమగ్ర పురుగు నియంత్రణ పద్ధతులను వినియోగించుకోవాలన్నారు. రైతులు పురుగుల ఉధృతి గుర్తించిన వెంటనే సమీప వ్యవసాయ



అధికారులను సంప్రదించి, సిఫారసు చేసిన మందులను మాత్రమే ఉపయోగించాలని వ్యవసాయాధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు తిరుపతి రెడ్డి, రాజు, మాధవ్, లింగారెడ్డి, పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి హాజరు

## కల సాకారమైన వేళ పేద కుటుంబాల ఆనందం అనిర్వచనీయం



**ఇల్లంతకుంట ఆగస్టు 29(జనంసాక్షి)**
సొంతింటి కల సాకారమవుతున్న వేళ పేద కుటుంబాల కళ్లల్లో కనిపించే ఆనందాన్ని చూడటం ద్వారా పొందిన అనుభూతి అనిర్వచనీయమని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్న 40 మంది లబ్ధిదారులు శనివారం నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇల్లంతకుంటలో 40 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ సొంత ఇళ్లలోకి అడుగుపెట్టడం, ఆ ఆనందోత్సవాల్లో తాను భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూసిన పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి వారి కలను సాకారం చేస్తోందని తెలిపారు. గృహప్రవేశాల సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యుల కళ్లల్లో కనిపించిన ఆనందం తనను ఎంతో సంతోషానికి గురిచేసిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించి, వారి జీవితాల్లో భద్రత, ఆత్మగౌరవం, ఆనందం నింపడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని అన్నారు. ఈ సంతోషాన్ని, ఈ ఆత్మగౌరవాన్ని పేద ప్రజలకు ఇవ్వాలనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోరుకుంటోందని ఆయన చెప్పారు. ఇది కేవలం ఇల్లు కాదు, ఒక భరోసా అని, ఇందిరమ్మ ఇల్లు పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వం పేదల ఇళ్ల కలను కల్లలుగా మిగిల్చిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇల్లు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని గృహప్రవేశాలు చేసుకున్న కుటుంబాలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కొత్త ఇళ్లలోకి అడుగుపెట్టిన లబ్ధిదారులు తమ ఆనందాన్ని ఎమ్మెల్యేతో పంచుకున్నారు. తమకు సొంతింటి కల నెరవేరేందుకు సహకరించిన ప్రభుత్వానికి, అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. గృహప్రవేశ కార్యక్రమాలు కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికుల సందడితో ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శశికళ, తహసీల్దార్ సురేష్, హౌసింగ్ డీఈ సాజిద్ ఇల్లంతకుంట సర్పంచ్ మామిడి రాజు, ఇల్లంతకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, రేపాక, రామోజీపేట, వల్లంపట్ల, వెంకట్రావుపల్లి సర్పంచులు కాత మల్లేశం, చొప్పరి భూమయ్య, నేరెళ్ల విజయ్ గౌడ్, చల్ల నవీన్ రెడ్డి, పార్టీ నాయకులు పసుల వెంకటి, ఎలగందుల ప్రసాద్, తిరుపతి, తూముకుంట రాజేందర్ రెడ్డి, బాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డితోపాటు వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నోటు బుక్కుల పంపిణీ**

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విద్యార్థులకు నోటు బుక్కులు పంపిణీ చేశారు. అనంతరం అంగన్ వాడీ కేంద్రం భవనాన్ని ఆయన ప్రారంభించారు.

**వల్లంపట్లలో...**

ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగోత్రి మహిళా సంఘం (వీవో) భవనాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన ప్రారంభోత్సవం జరుపుకోవడం ముదావహమని పేర్కొంటూ స్థల ధాత కట్ట సౌమ్య–శ్రీకాంత్ రెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ సురేష్, , వల్లంపట్ల గ్రామ సర్పంచ్ నేరెళ్ల విజయ్ గౌడ్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆల శ్రీనివాస్ రెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కట్ట సౌమ్య, పార్టీ నాయకులు ఎల్క అనిల్ కుమార్, నరేందర్, ఎలగందుల ప్రసాద్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వే ను పరిశీలించిన జాయింట్ కలెక్టర్..

**మేడిపల్లి,ఆగస్టు 29 (జనంసాక్షి):**
జగిత్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ మేడిపల్లి మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో భూముల రీ సర్వేలను పర్యవేక్షించి మండల సర్వేయర్లకు పలు సూచనలు ఇచ్చారు. గ్రామ నక్ష లో ఉన్న సర్వే నెంబర్ల కొలతల ప్రకారం మొత్తం ఎకరాల హద్దులను రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భూ సర్వే- రీ సర్వే ను సక్రమంగా పారదర్శకంగా పూర్తయ్యేలా అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ,ఎంఆర్ఓ, రెవెన్యూ అధికారులు, గ్రామ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.











## పదవ తరగతి 2026 సంవత్సరం ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**జమ్మికుంట,ఆగస్టు 29 (జనంసాక్షి):**
జమ్మికుంట ఆబాది జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యాభ్యాసం చేసినటువంటి పూర్వ విద్యార్థులు పింగళి వెంకటరెడ్డి, మార్క విజయ్ ప్రకాష్, డాక్టర్ కాటిపల్లి లింగారెడ్డి, అయిత శ్రీనివాస్, అమృత, సురేష్ అనే ఐదుగురు పూర్వ విద్యార్థులు 2015 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం ఈ పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు పురస్కారం, సర్టిఫికెట్ ప్రధాన చేస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా తేదీ. 29-8-2026 శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్ష 2026 లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు నగదు పురస్కారాలతో పాటు సర్టిఫికెట్ ప్రధానం చేశారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు పద్మ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ముగ్గురు విద్యార్థులు 1). దొంకటి సాక్షిత, 2). దొడ్డే రణ వర్ధన్,3). మైస అక్షిత్ లకు 5000, 3000 ,2000 రూపాయల చొప్పున నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి అయిత శ్రీనివాస్ విద్యార్థిని విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. విద్యార్థులకు భవిష్యత్తు విద్యావసరాలు తీర్చడానికి తమ సహకారం అందిస్తామని మరొక పూర్వ విద్యార్థి డాక్టర్ లింగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు రాజేంద్ర కుమార్, కృష్ణమూర్తి,సృజన ,రాజశ్రీ, దుర్గాప్రసాద్,స్థానిక కౌన్సిలర్ సుజాత, విద్యార్థుల తల్లిదండ్రులు కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్జీ -2లో సీఎస్ఓ ఆకస్మిక తనిఖీ

### భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి.. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ఆదేశం



**8వ కాలనీ (జనంసాక్షి) ఆగస్టు 29:**
సింగరేణి అర్జీ -2 ఏరియాలో సంస్థ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్ఓ) పసుల బాలరాజు శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఏరియాలోని కీలక ప్రాంతాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లు, సెక్యూరిటీ సిబ్బంది పనితీరు, సంస్థ ఆస్తుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా వకీల్‌పల్లి మైన్, 100 టన్ను, ఓసిపి-3 వ్యూ పాయింట్, భీమా డ్రాగ్‌లైన్ ప్రాంతాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తత, గార్డ్ పోస్టుల నిర్వహణ, సీసీ కెమెరాల పనితీరు, రాత్రివేళల్లో లైటింగ్ సౌకర్యాలను తనిఖీ చేశారు. అలాగే ఫెన్సింగ్ పరిస్థితి, స్క్రాప్‌యార్డు, కేబుల్ నిల్వ ప్రాంతాల్లో భద్రతా చర్యలను పరిశీలించారు. సింగరేణి సంస్థకు చెందిన విలువైన ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ సిబ్బంది కీలక పాత్ర పోషించాలని సీఎస్ఓ పసుల బాలరాజు సూచించారు. అనుమానాస్పద వ్యక్తుల రాకపోకలపై నిరంతరం నిఘా ఉంచాలని, కీలక ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా అనుమానాస్పద పరిస్థితులు కనిపించిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రత్యేకంగా రాత్రి వేళల్లో భద్రతా సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని, సెక్యూరిటీ పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ఆదేశించారు. గార్డ్ పోస్టుల వద్ద సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని హెచ్చరించారు. భద్రతా విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏరియాలోని సున్నితమైన ప్రాంతాలను గుర్తించి అక్కడ అదనపు భద్రతా చర్యలు చేపట్టాలని, సీసీ కెమెరాలు, లైటింగ్ తదితర భద్రతా పరికరాలు సక్రమంగా పనిచేసేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సంస్థ ఆస్తుల రక్షణతో పాటు ఉద్యోగులు, కార్మికుల భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో సీఎస్ఓ వెంట ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షరీఫ్ మహ్మద్, షిఫ్ట్ జమేదార్ గూడెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో అక్రమాలు జరిగాయి

## అంబేద్కర్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు సావనపెల్లి రాకేష్ ఆరోపణ

**ఇల్లంతకుంట, ఆగస్టు 29(జనంసాక్షి )**
ఇల్లంతకుంట మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయని సామాజిక ఉద్యమకారుడు, అంబేద్కర్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు సావనపెల్లి రాకేష్ ఆరోపించారు. శనివారం ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇల్లంతకుంటలో 40 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించారని తెలిపారు. సంబంధిత అధికారులు గ్రామపంచాయతీ ఆవరణలో ప్రజల సమక్షంలో 40 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి అధికారికంగా ప్రకటించారని పేర్కొన్నారు.అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఇందిరమ్మ కమిటీ ఏర్పాటు చేసి, గతంలో అధికారికంగా ఎంపిక చేసిన డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల జాబితా నుంచి కొందరి పేర్లను తొలగించారని రాకేష్ ఆరోపించారు. అంతేకాకుండా కొత్తగా ఎంపిక చేసిన లబ్ధిదారుల అధికారిక జాబితాను ప్రజలకు ప్రకటించకుండానే ఇళ్లను పంపిణీ చేయడం బాధాకరమన్నారు.ఇందిరమ్మ కమిటీ పేరును అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులకు అనుకూలంగా ఉన్న వ్యక్తులను లబ్ధిదారులుగా ఎంపిక చేసి, మొదటి జాబితాలో ఉన్న నిరుపేద కుటుంబాలను తొలగించారని ఆయన ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి సమస్యను తీసుకెళ్లేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు.శనివారం ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా స్వామి వివేకానంద చౌరస్తా వద్ద ఎమ్మెల్యేను కలిసి




సమస్యను విన్నవించుకునేందుకు రాకేష్, కిషోర్, వొళ్ళాల శ్రీనివాస్, వెళ్తుండగా ఇల్లంతకుంట పోలీసులు అడ్డుకుని వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని వారు తెలిపారు.



## ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**ముస్తాబాద్ ఆగస్టు 28 (జనం సాక్షి)**
ముస్తాబాద్ మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై జి జ్యోతి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది రక్షాబంధన్ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీస్ సిబ్బందితో కలిసి రక్షబంధన్ వేడుకలు నిర్వహించి. వారికి రాఖీలు కట్టి తమ ఆప్యాయతను, నమ్మకాన్ని కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి రాఖీలు కట్టే పరస్పర శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అనంతరం చేసి మరింత సందడి పోలీసులు ప్రజల రక్షణ కోసం అందిస్తున్న సేవలను గుర్తిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం పోలీస్ శాఖ సమాజానికి మధ్య ఉన్న పరస్పర గౌరవం నమ్మకం అభ్యర్థులను విస్తరంగా నిలిచింది రాఖీ కేవలం ఒక పండుగకు సంబంధించిన భారం మాత్రమే కాదని నమ్మకం రక్షణ సోదర భావానికి ప్రతీక అని కార్యక్రమం ద్వారా చెప్పారు. పోలీసులతో కలిసి రక్షబంధన్ వేడుకలను నిర్వహించడం ద్వారా సమాజాహితకత పరిష్కార సహకారం స్నేహభవని చాటారు.

# భూభారతి చట్టంతో భూ రీ సర్వే..

## తహసీల్దార్ మారుతిరెడ్డి

గంభీరావుపేట, **ఆగస్టు 28 జనం సాక్షి)**



తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి?2025 చట్టంలో భాగంగా భూ రికార్డుల ప్రక్షాళనకు గంభీరావుపేట మండలంలో భూ రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తహసీల్దార్ మారుతిరెడ్డి తెలిపారు.మండలంలోని ప్రతి గ్రామంలో దశలవారీగా భూ రీ సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఇందులో భాగంగా తొలుత శ్రీనివాసపురం, గుద్దులింగంపల్లి గ్రామాల్లో భూ రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.గతంలో నైజాం ప్రభుత్వ హయాంలో భూ రీ సర్వే నిర్వహించారని గుర్తుచేశారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టం ద్వారా మరోసారి సమగ్ర భూ సర్వే చేపడుతోందన్నారు. రీ సర్వే పూర్తయితే మండలంలోని ప్రతి రైతుకు ఎంత భూమి ఉందనే వివరాలు స్పష్టంగా తెలుస్తాయని తెలిపారు.భూముల హద్దులు, రికార్డుల్లో ఉన్న వివరాలను పరిశీలించి నమోదు చేయనున్నట్లు చెప్పారు.మొదట ప్రభుత్వ భూములను సర్వే చేయనున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు.ఆ తర్వాత అసైన్మెంట్ భూములు, అనంతరం పట్టా భూములను రీ సర్వే చేస్తామని తెలిపారు.భూ రికార్డుల్లో ఎలాంటి తప్పులు, వ్యత్యాసాలు ఉన్నా సర్వే ద్వారా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు.రైతులు తమ భూములకు సంబంధించిన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.రీ సర్వే ప్రక్రియలో అధికారులకు అవసరమైన సమాచారం అందించి సహకరించాలని కోరారు.భూముల వివరాలను పారదర్శకంగా నమోదు చేయడమే రీ సర్వే ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ప్రతి గ్రామంలో సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారని చెప్పారు. భూ రీ సర్వే విజయవంతం కావడానికి రైతులందరూ సహకరించాలని తహసీల్దార్ మారుతిరెడ్డి కోరారు.



## జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఘనంగా క్రీడా పోటీలు

**ముస్తాబాద్ ఆగస్టు 28 జనం సాక్షి)**
హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జెడ్పీహెచ్ఎస్ బంధనకల్ పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పరశురాములు ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ చివరి నరేష్ గారు హాజరయ్యారు. వారితో పాటు వార్డు సభ్యులు వెంకటరెడ్డి గారు, యాదగిరి గౌడ్ పాల్గొన్నారు.విద్యార్థులకు వివిధ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులను అందజేశారు. క్రీడా పోటీల నిర్వహణకు ప్రోత్సాహంగా యువజన సభ్యులు ఎనగందుల నరసింహులు, ఎనగందుల నరేష్, మోట్ల వెంకటేష్ గార్లు బహుమతులను అందించడం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గ్రామ సర్పంచ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడలు కూడా జీవితంలో ఎంతో ముఖ్యమైనవని, క్రీడల ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆరోగ్యం మరియు ఐకమత్యం పెంపొందుతాయని తెలిపారు. మేజర్ ధ్యాన్‌చంద్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు క్రీడారంగంలో రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకట గోపాల చారి, సత్యనారాయణ రావు, శారద దేవి, రాములు గార్లు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని విజయవంతం చేశారు.

## ఓటర్ల జాబితా తప్పొప్పులపై అవగాహన..

### దమ్మన్నపేటలో 200 మంది వివరాల్లో పొరపాట్లు గుర్తింపు



**గంభీరావుపేట, ఆగస్టు 29: జనం సాక్షి:**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేటలో ఓటర్ల జాబితాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మండలంలో సుమారు 8 వేల మంది ఓటర్ల పేర్లలో తప్పొప్పులను గుర్తించినట్లు తహసీల్దార్ మారుతిరెడ్డి తెలిపారు.దమ్మన్నపేటలో సుమారు 200 మంది ఓటర్ల వివరాల్లో పొరపాట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో చిన్నచిన్న తప్పులు ఉంటే సమీప బీఎల్ఓను సంప్రదించాలని సూచించారు.గ్రామపంచాయతీ సర్పంచ్‌కు కూడా వివరాలు తెలియజేయవచ్చన్నారు.సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల వివరాల్లో పొరపాట్లు ఉంటే గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చి సంప్రదించాలని కోరారు.ప్రతి ఒక్కరూ ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని కోరారు.కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శివాజీ సేన జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా బుస మధు

**మల్లాపూర్ ఆగస్టు29( జనం సాక్షి)**



ఛత్రపతి శివాజీ సేన జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా మల్లాపూర్ మండల్ ముత్యంపేట గ్రామానికి చెందిన బుస మధు ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు తోట మధుకర్ తెలిపారు. తెలంగాణలో జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు శివాజీ సేనను మరింత బలోపేతం చేసే బాధ్యతలను మధు కు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు బుస మధు మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు తోట మధుకర్ కు, తన నియామకానికి సహకరించిన శివాజీ సేన నాయకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను పదవిగా కాకుండా బాధ్యతగా భావించి పనిచేస్తానన్నారు. శివాజీ సేనను బలోపేతం చేయడంలో ముందుంటానని మధు తెలిపారు. బాధ్యతలు అప్పగించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

జమ్మికుంట,ఆగస్టు 29 (జనం సాక్షి):
జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ & పీ.జీ కళాశాలలో కళాశాల ఇంచార్జ్&ఇ ప్రిన్సిపాల్ డా. కే. గణేష్ అధ్యక్షతన తెలుగు విభాగాధిపతి డా.మురాడి శ్యామల ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ఇంచార్జ్ ప్రిన్సిపాల్ గిడుగు వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొద్దిమంది వరకే పరిమితమైన చదువును అందరికీ అందుబాటులోనికి తెచ్చిన వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులని అన్నారు.భాషలెన్ని నేర్చుకున్నా భావోద్వేగాలను వ్యక్తం చేయడానికి మధురమైన తెలుగు భాషకు సాటేది లేదని అన్నారు.తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ మురాడి శ్యామల మాట్లాడుతూ తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకువచ్చి నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న మాధుర్యాన్ని తెలియజేసిన మహనీయులు గిడుగు అని అన్నారు.తెలుగు భాష ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు తెలుగు మాధ్యమం అందుబాటులో రావాలని ప్రభుత్వం జారీచేసే ఉత్తర్వులు, సమాచారం తెలుగులో ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు



ఉమాకిరణ్,డా.కె.మాధవి, డా.పీ.స్వప్న , డా.రాజ కుమార్,డా.ఎంబాడి రవి, రవిందర్, డా.రవిప్రకాష్, డా.శ్రీనివాస్, రమేష్, సాయికుమార్,అరుణ్ కుమార్, అధ్యా పకేతర బృందం, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్య పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

### మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో కార్యాచరణ సమాయత్తం



**జనం సాక్షి జగిత్యాల జిల్లా ఆగస్టు గొల్లపల్లి :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా వారి వైఫల్యాలను ఎండగట్టడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు జగిత్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో ధర్మపురి నియోజకవర్గం ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఉద్యమ ప్రణాళికను ఖరారు చేయడం పక్కా వ్యూహాత్మక అడుగు కొప్పుల ఈశ్వర్ నేతృత్వంలో క్షేత్రస్థాయి నిరసనలకు సమాయత్తం కావడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతుంది. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నేతృత్వంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి భవిష్యత్ ఉద్యమ ప్రణాళికను ఖరారు చేశారు. భాతర రాష్ట్ర సమితి సెప్టెంబర్ 2 నుంచి 8 రోజుల పాటు జరిగే నిరసన కార్యక్రమాలపై వివరించారు. ఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ, మహిళలకు నిరుద్యోగ భృతి వంటి నెరవేరని వాగ్దానాలపై నిలదీయాలని కోరారు. ధర్మపురి నియోజకవర్గంలో నిలిచిపోయిన మౌలిక వసతులు మరియు ఉపాధి రహిత సమస్యలపై క్షేత్రస్థాయి పోరాటం చేయాలని ఆయన అన్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రతి ఇంట్లోనూ గ్రామంలోనూ ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. ?రాబోయే రోజుల్లో ఈ నిరసన ఉద్యమం ధర్మపురి నియోజకవర్గంతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో ఎంతటి ప్రభావం చూపుతుందో చూడాలి. ?కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, ప్రతి గ్రామంలోనూ ప్రజల సమస్యలను గుర్తించి ప్రభుత్వాన్ని నిలదీసేలా ముమ్మర కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ అధినేత కేసీఆర్ మార్గదర్శకంలో, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుల నాయకత్వంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతామని పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది. ఈ సమావేశంలో ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## క్రీడా స్ఫూర్తితోనే ఆరోగ్యకర సమాజం

### - ఖోఖో, టగ్ ఆఫ్ వార్ పోటీలు.. విజేతలకు బహుమతులు

**సుల్తానాబాద్,ఆగస్టు 29(జనంసాక్షి) :**
జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని సుల్తానాబాద్ ఖేల్ ఇండియా సెంటర్‌లో శనివారం ఖోఖో, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో రెండో రోజు పోటీలు కొనసాగాయి. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

– క్రీడలతో శారీరక దారుఢ్యం : పోటీల అనంతరం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి ఏ. సురేష్, సుల్తానాబాద్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత నిత్య జీవితంలో క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, పట్టుదల పెంపొందుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ వంటి క్రీడా దిగ్గజాల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, కార్యదర్శి అమీరిశెట్టి తిరుపతి, మున్సిపల్ కౌన్సిలర్లు గాజుల రాజమల్లు, వర ప్రదీప్,అబ్బాయి గౌడ్,కందుకూరి కుమార్,కోచ్ గెల్లు మధుకర్, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్, సత్యం,అజ్జు,శివ,సంధ్య,క్రీడాకారులు,తదితరులు పాల్గొన్నారు.



## చల్లూరు ప్రభుత్వ హైస్కూల్ స్థల ఆక్రమణపై ఎంక్వయిరీ

### కరీంనగర్ డిఈఓ చైతన్య జైని

**వీణవంక ఆగస్టు 29(జనంసాక్షి)**
వీణవంక మండలంలోని చల్లూరు గ్రామంలో శనివారం ప్రభుత్వ హైస్కూల్ స్థల ఆక్రమణపై డిఇఓ చైతన్య జైని ఎంక్వయిరీ చేపట్టారు. ప్రభుత్వ హైస్కూల్ స్థలాన్ని కొంతమంది షాప్ యజమానులు ఆక్రమించి ఎచ్చేదగ వ్యాపారన్ని కొనసాగిస్తు న్నారని, ఇప్పలపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ముదిగంటి రఘునాథ రెడ్డి,ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా,ఆక్రమణకు గురైన పాఠశాల స్థలం ఎంక్వయిరీ, శనివారం రోజున డీఈవో చైతన్య జైని పాఠశాల ఆవరణలో షాప్ యజమానులతో విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా షాప్ సంబంధించిన పత్రాలను,పర్మిషన్ పత్రాలను,డిపాజిట్ పత్రాలను పరిశీలించారు. ఈ ఎంక్వయిరీలో మండల విద్యాధికారి శోభారాణి, పాఠశాల హెడ్మాస్టర్ సంపత్ కుమారచారి,షాపుల యజమానులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



## పెద్దపల్లి బస్టాండులో పోలీసుల నిఘా

### - అనుమానితుల లగేజీలను తనఖీ చేసి విచారించారు



**పెద్దపల్లి,ఆగస్టు 29(జనంసాక్షి) :**
రాఖీ పండుగ పురస్కరించుకొని శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ లో మహిళల ప్రయాణికుల రద్దీ పెరగడంతో వారి రక్షణకై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెద్దపల్లి టౌన్ ఎస్ ఐ నరేష్ ,వారి సిబ్బంది తో కలిసి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారిపై నిగా పెట్టి అనుమానితులను, వారి లగేజీలను తనకి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అపరిచితుల పట్ల, జేబు దొంగల పట్ల జాగ్రత్తగా ఉండాలని, క్షేమంగా గమ్యం చేరాలని సూచించారు. ఎస్ ఐ నరేష్, హెడ్ కానిస్టేబుల్ ఎం రమేష్, కానిస్టేబుల్స్ సతీష్, ప్రభాకర్, స్పెషల్ పార్టీ సిబ్బంది ఉన్నారు.

## అబ్బాపూర్ లో డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

**జూలపల్లి,ఆగస్ట్ 29(జనంసాక్షి) :** జూలపల్లి మండలం అబ్బాపూర్ గ్రామంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కూమార్ మరియు ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయ రమణారావు ఆదేశాల మేరకు శనివారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ రెషన్ కార్డులను గ్రామ సర్పంచ్ దండే వెంకటేష్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.





## రాత్రి అయినా తప్పని ఎరువుల కష్టాలు..!

### రైతుల నిరీక్షణ.. యాప్ చుట్టూ ప్రదక్షిణలు

**సదాశివనగర్ ఆగస్టు 29 జనంసాక్షి**
సదాశివనగర్ మండలం ఉత్తునూర్ సహకార సంఘం పరిధిలోని రైతులకు ఎరువుల కష్టాలు తప్పడం లేదు. పగలంతా వ్యవసాయ పనులు చేసుకుని సాయంత్రం ఇంటికి చేరాల్సిన రైతులు, ఎరువుల కోసం రాత్రి వరకు సహకార సంఘాలు, ఎరువుల దుకాణాల వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసర సమయంలో పంటలకు యూరియా అందక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు స్టాక్ వస్తుందో తెలియని పరిస్థితి, వచ్చినా అందరికీ సరిపడా ఎరువులు దొరుకుతాయో లేదో అన్న అనిశ్చితి రైతులను వెంటాడుతోంది. యాప్‌లో స్టాక్ నమోదు, బుకింగ్ ప్రక్రియ, సాంకేతిక సమస్యలు కూడా రైతులకు అదనపు తలనొప్పిగా మారుతున్నాయని రైతులు వాపోతున్నారు. "పగలు పొలం పని.. రాత్రి ఎరువుల కోసం క్యూలు.. ఇదేనా రైతుకు ఇచ్చే భరోసా?" అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. ఎరువులు సకాలంలో అందకపోతే పంట దిగుబడిపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు రాత్రింబవళ్లు క్యూలలో నిలబడాల్సిన పరిస్థితిని వెంటనే పరిష్కరించి, ప్రతి రైతుకు అవసరమైన మేర ఎరువులను పారదర్శకంగా, సకాలంలో అందించాలని రైతులు ప్రభుత్వాన్ని, వ్యవసాయ శాఖ అధికారులను కోరుతున్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

#### - శాంతి నగర్ లో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్

**పెద్దపల్లి,ఆగస్టు 29(జనంసాక్షి) :**
ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని 2 వ వార్డ్ శాంతినగర్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) కార్యక్రమాన్ని శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో చేపడుతున్న ఓటర్ల వివరాల పరిశీలన, మ్యాపింగ్, దరఖాస్తుల స్వీకరణ తదితర ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, అందుబాటులో ఉన్న రికార్డులతో సరిపోల్చి నమోదు చేయాలని తెలిపారు. ఓటర్ల పేరు, చిరునామా, వయస్సు,కుటుంబ వివరాలు తదితర అంశాలను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ఒకే వ్యక్తికి బహుళ ప్రాంతాల్లో ఓటు ఉన్నట్లు గుర్తించిన సందర్భాల్లో నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో నిర్ధారణ చేయాలని ఆదేశించారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించే సమయంలో ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అర్హత కలిగిన ఓటర్లు తమ వివరాలను పరిశీలించుకునేలా సహకరించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు, అభ్యంతరాలను స్వీకరించి, వాటిని నిర్ణీత గడువులోగా నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి వివరాలను పలుమార్లు పరిశీలించిన తర్వాతే నమోదు, ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో నిర్దేశించిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని, ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గంగయ్య , తహసిల్దార్ రాజయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్,బీఎల్ఓలు, సంబంధిత అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.



# సింగరేణి క్వార్టర్లలో షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలు అరికట్టాలి

## బాధిత క్వార్టర్‌కు తక్షణమే మరమ్మతులు ప్రారంభించిన యాజమాన్యానికి సీఐటీయూ ధన్యవాదాలు

**8వ కాలనీ (జనంసాక్షి) ఆగస్టు 29:**
ఆర్జీ-2 ఏరియా జీడీకే 8వ ఇంక్లైన్ కాలనీలోని ం2-1255 క్వార్టర్‌లో శుక్రవారం రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని ఫ్రిడ్జ్‌తో పాటు పలు గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు పూర్తిగా దగ్ధమై తీవ్ర ఆస్తి నష్టం సంభవించింది. అదృష్టవశాత్తూ కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లడంతో ప్రాణనష్టం తప్పింది.

సమాచారం అందుకున్న వెంటనే సీఐటీయూ నాయకులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. కాలనీలోని పలు సింగరేణి క్వార్టర్లలో సరైన ఎర్తింగ్ వ్యవస్థ లేకపోవడం, ఓఅః, ఖీఅఅః వంటి రక్షణ పరికరాల ఏర్పాటు సక్రమంగా లేకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

కాలనీలోని అన్ని క్వార్టర్లలో విద్యుత్ వైరింగ్, ఎర్తింగ్, ఓఅః, ఖీఅఅః ట్రిప్పింగ్ వ్యవస్థలను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని, లోపాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీఐటీయూ యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని కోరింది.

యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు

ప్రమాదం జరిగిన వెంటనే మైన్ రెస్క్యూ స్టేషన్‌కు చెందిన బృందం ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకుంది. దీంతో ప్రమాద తీవ్రత మరింత పెరగకుండా నివారించగలిగారు.

ఈ ఘటనపై సీఐటీయూ నాయకత్వం శనివారం ఉదయమే జనరల్ మేనేజర్, డీజీఎం (సివిల్/పర్సనల్) అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లింది. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించి, టెండర్ల పేరుతో జాప్యం చేయకుండా ఫాస్ట్‌ట్రాక్ పద్ధతిలో అదే రోజున బాధిత క్వార్టర్‌లో మరమ్మతు పనులను ప్రారంభించారు.

కార్మిక కుటుంబానికి ఎదురైన సమస్యపై తక్షణమే స్పందించి మరమ్మతు పనులు ప్రారంభించిన జనరల్ మేనేజర్, డీజీఎం, సంబంధిత సివిల్, ఎలక్ట్రికల్ అధికారులకు సీఐటీయూ, కాలనీవాసుల తరపున నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ బ్రాంచ్ సెక్రటరీ కుంట ప్రవీణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ సోమరాపు వెంకన్న, నాయకులు శివకుమార్, శ్రావణ్, సుమన్, మల్లేశం, నరేశ్, తిరుపతితో పాటు స్థానిక కార్మికులు, కాలనీవాసులు పాల్గొన్నారు.







# నాటిన మొక్కలకు నీడే కరువు..
# సంరక్షణపై నిర్లక్ష్యం

### వనమహోత్సవం మొక్కలు వాడిపోతున్నాయ్..
### పట్టించుకునేవారేరీ?

**గంభీరావుపేట, ఆగస్టు 29, జనంసాక్షి:**
గంభీరావుపేట మండల కేంద్రంలోని నవాజ్ చెరువు కట్టపై వనమహోత్సవంలో భాగంగా అధికారులు నాటిన మొక్కలకు సంరక్షణ కరువైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించాలనే ఉద్దేశంతో మొక్కలు నాటినప్పటికీ, వాటి సంరక్షణపై సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందక కొన్ని మొక్కలు ఎండిపోతుండగా, మరికొన్ని మొక్కల చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోయిందని చెబుతున్నారు. మొక్కలకు రక్షణగా ట్రీగార్డులు లేకపోవడంతో మేకలు తదితర పశువులు మొక్కలను తినడంతో కూడా నష్టం వాటిల్లుతోందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం మొక్కలు నాటేందుకు నిధులు ఖర్చు చేస్తున్నా, వాటి సంరక్షణపై సరైన పర్యవేక్షణ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రతి ఏడాది వనమహోత్సవం పేరుతో మొక్కలు నాటుతున్న అధికారులు, గతంలో నాటిన మొక్కల్లో ఎన్ని బతికాయి.. ఎన్ని ఎండిపోయాయి అనే వివరాలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. మొక్కలు నాటడంతో పాటు అవి ఎదిగే వరకు నిరంతరం నీరు పోయడం, రక్షణ కల్పించడం, పర్యవేక్షించడం వంటి చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

**వివో వినీల్ రెడ్డి వివరణ:**
ఈ విషయంపై వివో వినీల్ రెడ్డి మాట్లాడుతూ.. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను రీప్లేస్‌మెంట్ చేయిస్తామని తెలిపారు. మేకలు తినడంతో దెబ్బతిన్న మొక్కలను కూడా గుర్తించి వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటిస్తామని చెప్పారు. మొక్కల చుట్టూ ట్రీగార్డులు ఏర్పాటు చేసి రక్షణ కల్పిస్తామని వెల్లడించారు. ఇకపై మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీఎమ్మెల్యే సతీష్ కుమార్

### అధైర్యపడొద్దు అండగా ఉంటామని బాధిత కుటుంబాలకు భరోసా..

**చిగురుమామిడి ఆగస్టు 29 (జనంసాక్షి):**
మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన పలువురి కుటుంబాలను హుస్నాబాద్ నియోజకవర్గ మాజీఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ శనివారం పరామర్శించారు.మండల కేంద్రానికి చెందిన కోనేటి వెంకవ్వ,సీతారాంపూర్ గ్రామానికి చెందిన ముస్కుల వెంకటరెడ్డి,ఇందుర్తికి చెందిన బల్ల రాములు,గౌరవెల్లి లచ్చుమ్మ, రామంచ గ్రామానికి చెందిన నర్రా జగదీశ్వర్ రెడ్డి కుటుంబాలను ఆయన స్వయంగా కలిసి వారి మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.ఈ పరామర్శ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ ఒంటెల కిషన్ రెడ్డి,మాజీవైస్ఎంపీపీ బేతి రాజిరెడ్డి,మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు, ఉపసర్పంచ్ లు కాశబోయిన విజయలక్ష్మి రాజు యాదవ్,గీట్ల తిరుపతిరెడ్డి,వార్డ్ మెంబర్ తాటికొండ అభిషేక్ రెడ్డితోపాటు యూత్ అధ్యక్షులు తాటికొండ సందీప్ రెడ్డి,సీనియర్ నాయకులు అందే సుజాత పోచయ్య,అందే రాయమల్లు, మహంకాళి కొమురయ్య,శ్యామకూర సంపత్ రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షులు ఎస్కే సిరాజ్, పరిపాటిరవీందర్ రెడ్డి,బిల్లా వెంకట్ రెడ్డి,చెరుకు సంజీవ్,మాజీ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి,తదితర ముఖ్య నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ముత్యంపేటలో గ్రామ సభ

**మల్యాల ఆగస్టు 29 (జనం సాక్షి)**
ముత్యంపేట గ్రామంలో శనివారం వికసిత్ భారత్ 2047 లక్ష్యంతో వీబీ-జీ రామ్ జీ చట్టం 2025 తొలి గ్రామసభ నిర్వహించారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల ఉపాధి హామీ కల్పిస్తారని అధికారులు తెలిపారు.వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలో నీటి భద్రత,మౌలిక వసతులు,జీవనోపాధి,విపత్తు నిర్వహణ అంశాల్లో 318 పనులు ఉన్నాయని, గ్రామ అవసరాలను గుర్తించేందుకే సభ నిర్వహించినట్లు చెప్పారు.సర్పంచ్ దారం ఆదిరెడ్డి, పాలకవర్గం,ఏపీవో, అధికారులు,ప్రజలు పాల్గొన్నారు.

# రోస్టర్ పాయింట్లతో మాలలకు అన్యాయం జరుగుతోంది

## ఆగస్టు 31న సెక్రటేరియట్ ముట్టడిని విజయవంతం చేయండి: మాల సంఘాల నేతల పిలుపు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 29 (జనం సాక్షి)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రోస్టర్ పాయింట్ల విధానం వల్ల మాల విద్యార్థులు, నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మాల సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ సమస్యపై నిరసనగా ఆగస్టు 31న నిర్వహించనున్న "హలో మాల?చలో సెక్రటేరియట్ ముట్టడి" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ మాల మహానాడు ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు కంకణాల రమేష్, మాల కోఆర్డినేషన్ జిల్లా కన్వీనర్ బత్తుల ధర్మపురి, కో-కన్వీనర్ పూల రవీందర్, దళితరత్న అవార్డు గ్రహీత పెరుమండ్ల రాజనర్సింహులు, జిల్లా నాయకులు సుతారి సుధాకర్, గోనుగుప్పుల లింగం, కంకణాల జగన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపు మేరకు చేపట్టనున్న సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమంలో కామారెడ్డి జిల్లాలోని మాలలు, మాల ఉపకులాలు, విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కంకణాల రమేష్ మాట్లాడుతూ, రోస్టర్ పాయింట్ల కారణంగా మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని అందరూ ఐక్యంగా ఉద్యమ రూపంలో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ముందస్తు అరెస్టులు చేసినప్పటికీ పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు సమన్వయంతో పనిచేసి సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మాల కోఆర్డినేషన్ జిల్లా కన్వీనర్ బత్తుల ధర్మపురి మాట్లాడుతూ విద్య, ఉద్యోగ రంగాల్లో తమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర కార్యదర్శి రాజనర్సింహులు మాట్లాడుతూ మాల సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మాలలకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

జిల్లా నాయకుడు సుతారి సుధాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రోస్టర్ పాయింట్ల అంశాన్ని పునఃపరిశీలించి మాలలు, మాల ఉపకులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అడ్డుకునే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

ఆగస్టు 31న చేపట్టనున్న సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి మాలలు, మాల ఉపకులాలు, విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నాయకులు కోరారు.



# వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు

**హుజురాబాద్, ఆగష్టు 29 (జనం సాక్షి) :** తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు శనివారం హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా హుజురాబాద్ మండలంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ చెల్పూర్ లో ఎనిమిది తొమ్మిది పది తరగతులు చదువుతున్న విద్యార్థులకు దేశభాషలందు తెలుగు లెస్స అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు ఈ వ్యాసరచన పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులకు ట్రస్టు నిర్వాహకులు సామాజిక కార్యకర్త డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు ఇ.అనురాధ చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులుగా శంకర్ నారాయణ డిక్షనరీలను అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ గిడుగు వెంకట రామమూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవం గా జరుపుకుంటామని, నిజమైన భావ ప్రేరేపణ మన మాతృభాష తెలుగు వల్లనే వల్లనే వస్తుందని, తెలుగులో విద్యాబోధన వల్ల మైండ్ చురుకుగా పనిచేస్తుందని, గ్రహణ సామర్థ్యం పెరుగుతుందని, తెలుగు భాష తల్లిపాల లాంటిదని తెలిపారు. విషయ పరిజ్ఞానం, భాష పై నైపుణ్యం పెంచుటకై మదరమ్మ ట్రస్ట్ వారు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించడం అభినందనీయమని తెలిపారు.



అనంతరం పోటీలో మంచి ప్రతిభ కనబరిచిన ఎల్ సాహితీ, ఎన్ అక్షర, బి శ్రీక్షణ్య, జి అశ్వంత్ సాయి, డి సిలోమి లను ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మమత, గోదాదేవి, అంజనీదేవి,స్వర్ణలత,శ్రీదేవి, రాజేందర్, శ్రీనివాస్,సుధాకర్ పాల్గొన్నారు




## నీట్-పీజీ 2026 పరీక్ష నిర్వహణకు
# పటిష్ట ఏర్పాట్లు చేయాలి
## కలెక్టర్ కోయ శ్రీహర్ష

డీఎంహెచ్ఓకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.పరీక్షా కేంద్రాల్లో సీసీటీవీ నిఘా, మొబైల్ జామర్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి అభ్యర్థికి (హెచ్హెచ్ఎండీ) మాన్యువల్ బాడీ ఫ్రిస్కింగ్ నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్ ధృవీకరణ, ఫోటో, లెఫ్ట్ థంబ్ ఇంప్రెషన్, ఫేస్ కంపారిజన్, బార్‌కోడ్ స్కానింగ్ వంటి నిర్దేశిత ప్రక్రియలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, గడియారాలు, ఆభరణాలు, షూస్ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదని స్పష్టం చేశారు.పరీక్షా పర్యవేక్షణ కోసం జిల్లాలో రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసినట్ల తెలిపారు. ప్రశ్నపత్రం ఐదు టైమ్-బౌండ్ సెక్షన్లుగా ఉండి, ఒక్కో సెక్షన్‌కు 42 నిమిషాల సమయం ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులకు వాటర్ బాటిల్ అందిస్తామని, రఫ్ షీట్, పెన్ అందించబడవని తెలిపారు. పరీక్ష ప్రారంభానికి ముందు రిజిస్ట్రేషన్ పూర్తైన అనంతరం అభ్యర్థులకు బయో బ్రేక్‌లకు అనుమతి ఉండదని తెలిపారు. సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పరీక్షను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.పరీక్షా కేంద్రాల్లో అమలు చేయాల్సిన అన్ని నిబంధనలను అధికారులు, పరీక్షా సిబ్బంది కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధంగా ఉంచాలని, పరీక్షా నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య,తహసిల్దార్ రాజయ్య, సుల్తానాబాద్ తహసిల్దార్ బషీరుద్దీన్, రామగిరి తహసిల్దార్ సుమన్, ఏసిపి జి కృష్ణ,పరీక్షా కేంద్రాల నిర్వాహకులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు
- జూలపల్లి మండలం వెంకట్రావుపల్లిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్
- ఎలిగేడ్ మండలం లోకపేట్‌లో భూ రీ-సర్వే పనుల పరిశీలన
- లైసెన్స్‌డ్ సర్వేయర్ రోజుకు 40 ఎకరాల చొప్పున సర్వే పూర్తి చేయాలని ఆదేశం



**పెద్దపల్లి,ఆగష్టు 29(జనంసాక్షి) :** ప్రత్యేక సవరణ ఓటర్ల జాబితా (సర్) ప్రక్రియలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ఆదేశించారు.శనివారం జూలపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటి సర్వే, ఓటర్ల వివరాల పరిశీలన,మ్యాపింగ్ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలు, చిరునామా మార్పులు, ఇతర అభ్యంతరాలు ఉన్న సందర్భాల్లో నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు లిలినోటీసులు సక్రమంగా జారీ చేయాలనిలిలి ఆదేశించారు.జారీ చేసిన నోటీసులకు సంబంధించి వివరణలను స్వీకరించి, ప్రతి అంశంపై నిబంధనల ప్రకారం విచారణ నిర్వహించాలని తెలిపారు. ఎటువంటి అర్హుడి పేరు అనవసరంగా తొలగించకుండా, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అదేవిధంగా,ఎలిగేడ్ మండలం లోకపేట్ గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పరిశీలించారు. సర్వే పనుల పురోగతిని, భూముల కొలతలు, సరిహద్దుల నిర్ధారణ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి సమక్షంలోనే భూముల కొలతలు నిర్వహించి వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు.రీ-సర్వే పనులను వేగవంతం చేసి లిలిలైసెన్స్‌డ్ సర్వేయర్ రోజుకు కనీసం 40 ఎకరాల చొప్పున సర్వే పూర్తి చేయాలనిలిలి అదనపు కలెక్టర్ ఆదేశించారు.ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పనులు జరిగేలా పర్యవేక్షించాలని, సర్వేలో ఎదురయ్యే సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. భూ సరిహద్దులు, యాజమాన్య వివరాల నమోదు సమయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి, రైతులకు ముందస్తుగా అవసరమైన సమాచారం అందించాలని తెలిపారు.ఎస్ఐఆర్, రీ-సర్వే రెండు ప్రక్రియల్లోనూ అధికారులు నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అదనపు కలెక్టర్ సూచించారు.సంబంధిత అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, బూత్ లెవల్ అధికారులు, లైసెన్స్‌డ్ సర్వేయర్,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు
- గంజాయి సాగు గుర్తిస్తే కఠిన చర్యలు -
- చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలి
- జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సిఓఆర్డీ) సమావేశంలో అదనపు కలెక్టర్





**పెద్దపల్లి,ఆగష్టు 29(జనంసాక్షి) :** మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పేర్కొన్నారు.శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సిఓఆర్డీ) సమావేశంలో ఆయన పాల్గొని జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు మాట్లాడుతూ,యువత జీవితాలను మాదకద్రవ్యాల మహమ్మారి నాశనం చేస్తోందని,సరదా కోసం కూడా ఎటువంటి మత్తు పదార్థాలు చెడు అలవాట్లకు అలవాటు పడవద్దని సూచించారు. ఒకసారి మాదకద్రవ్యాలకు బానిసైతే వ్యక్తిగత జీవితం,కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఎక్కడైనా గంజాయి సాగు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం గంజాయి సాగుదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.డ్రగ్స్ విక్రయం, కొనుగోలు, నిల్వ, అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అన్ని చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.జిల్లాలో మాదకద్రవ్యాలకు సంబంధించిన ప్రతి వివరాన్ని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమాలతో పాటు డ్రగ్స్ దుష్పరిణామాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ప్రజా ప్రదేశాలు, రవాణా కేంద్రాల వద్ద తరచూ తనిఖీలు నిర్వహించాలని, విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై నిరంతర అవగాహన కల్పించాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. డ్రగ్స్‌కు బానిసైన వారు చికిత్స పొందేందుకు రామగుండం ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ-అడిక్షన్ కేంద్రాన్ని వినియోగించుకోవాలని అన్నారు. డీ-అడిక్షన్ కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. డ్రగ్స్ విక్రయం, అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసు శాఖ, సంబంధిత అధికారులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో కీలకమని అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, సెక్షన్ పర్యవేక్షకులు ధీరజ్ , జిల్లా పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, రెవెన్యూ శాఖ, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌లో అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు అందించి పకడ్బందీగా విచారణ చేపట్టాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి - జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి**

పెద్దపల్లి,ఆగస్టు 29(జనంసాక్షి) : ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, వారితో పకడ్బందీగా విచారణ నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.శనివారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ, పంపిణీ, విచారణ ప్రక్రియపై జిల్లాల వారీగా సమీక్షించారు.సమీకృత కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీరాములు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అరుణశ్రీ తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు పంపిణీ చేయాలని సూచించారు. నోటీసులు అందించిన అనంతరం సంబంధిత ఓటర్లకు విచారణకు పూర్తి అవకాశం కల్పించి, వారి వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.విచారణ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో సుమారు 19 వేల నో మ్యాపింగ్ ఓటర్లు, 1.22 లక్షల అనామలీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే నోటీసులు జనరేట్ చేసి, వాటి పంపిణీ ప్రక్రియను చేపట్టామని పేర్కొన్నారు.నోటీసులు అందుకున్న ఓటర్లకు విచారణ ప్రక్రియ కూడా కొనసాగుతోందని, నిర్ణీత గడువులోగా విచారణను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలోని ప్రతి వివరాన్ని నిశితంగా పరిశీలించి, అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షిస్తూ, నిబంధనల ప్రకారం అనామలీస్, నో మ్యాపింగ్ అంశాలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ గంగయ్య, సంబంధిత ఎన్నికల అధికారులు, తదితరులు,పాల్గొన్నారు.







## 12వ వార్డు లోప్రత్యేక వైద్య శిబిరం

సుల్తానాబాద్,ఆగస్టు 29(జనంసాక్షి) : మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు లో డెంగ్యూ కేసు గుర్తించడంతో నివారణకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి పలువురు నుంచి రక్త నమూనాలు సేకరించారు.డాక్టర్ నిస్సీ క్రిస్టినా ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో డాక్టర్ సింధుజ డెంగ్యూ వ్యాధి సోకిన వ్యక్తి నివాసంతో పాటు పరిసర గృహాలలో పైరేత్రం స్ప్రే చేయించి ప్రజలకు డెంగ్యూ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.ప్రజలు తమ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు అవసరమైన పారిశుద్ధ్య చర్యలు పాటించాలని వైద్య సిబ్బందికి సూచించారు.జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శరీర నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ టీ రమేష్ ,12వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ అమిరిశెట్టి శ్రావణి - రాకేష్ , హెల్త్ అసిస్టెంట్ రాజేశ్వర రావు, సానిటరీ ఇన్స్పెక్టర్ టి.రమేష్,మాజీవార్డు మెంబర్ అమిరిశెట్టి తిరుపతి,ఏఎన్ఎం రమాదేవి, ఆశావర్కర్లు, సుజాత, స్వరూప, కోమల,సుగుణ తో పాటువార్డు ప్రజలు పాల్గొన్నారు.

## భూ సర్వే కు రైతులు సహకరించాలి

### సర్పంచ్ దీకొండ భూమేష్ కుమార్



సుల్తానాబాద్,ఆగస్టు 29(జనంసాక్షి): ప్రభుత్వం చేస్తున్న భూముల రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐతురాజుపల్లి సర్పంచ్ దీకొండ భూమేష్ కుమార్ సూచించారు.శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభ కార్యక్రమానికి రైతులు హాజరు కాగా సమావేశాన్ని ఉద్దేశించి సర్పంచ్ దీకొండ భూమేష్ కుమార్ మాట్లాడుతూ భూ రీ సర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని,ప్రతి రైతు తన భూమిని రీ సర్వే చేయించుకోవాలని, రైతులు సంబంధిత అధికారులకు సహకరిస్తేనే భూ,రీ సర్వే విజయవంతం అవుతుందని పిలుపునిచ్చారు.పట్టా భూములతో పాటు ప్రభుత్వ భూములు,రీ సర్వే చేయాలని సర్పంచ్ దీకొండ భూమేష్ కుమార్ సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ శంకర్, ఆర్ ఐ మహేష్, మండల సర్వేయర్ కృష్ణప్రియ, కార్యదర్శి భాస్కర్ రెడ్డి, ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, జిపిఓ సృజన, వార్డు మెంబర్లు న్యాతరి అరవింద్, రమణారెడ్డి, రాజమ్మ, గ్రామ ప్రజలు రైతులు పాల్గొన్నారు.



## విజ్ఞన్నకు రాఖీ కట్టిన మంత్రి సీతక్క.ఆత్మీయ అనురాగాలకు నిదర్శనం రాఖీ పండుగ



సుల్తానాబాద్,ఆగస్టు 29(జనంసాక్షి) : రాఖీ పండుగను పురస్కరించుకొని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ విజయ రమణారావు కు రాఖీ కట్టారు.ఈ సందర్భంగా వారి ఆత్మీయ అనురాగాలను పండుగ సందర్భంగా పంచుకున్నారు.




## లేబర్ కమిషనర్ వద్ద జరిగిన అగ్రిమెంట్లపై కాలపరిమితి ఎప్పుడు

**- సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తుమ్మల రాజారెడ్డి..**

గోదావరిఖని, జనంసాక్షి : స్థానిక సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) శ్రామిక భవన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ ఇటీవల లేబర్ కమిషనర్ వద్ద ఏఐటియుసి యాజమాన్యం కలిసి చేసుకున్న ఒప్పందాల అమలుకు కాలపరిమితి ఎప్పుడని ప్రశ్నించారు.ఇప్పటికే పలుసార్లు ఒప్పందాలపై యాజమాన్యం సానుకూలత వ్యక్తం చేసిందని చెబుతూ రెండు సంవత్సరాల కాలం గడిపారని, ఇప్పుడు అదే ధోరణిలో ఒప్పందం చేసుకున్నామని చెబుతున్నారే తప్ప,ఫలానా సమయం నుండి అమలు చేస్తామని పూర్తిగా చెప్పకపోవడం సరికాదని అన్నారు.ఇందులో పలు డిమాండ్లు గతంలోనే ఒప్పుకున్న దాని ప్రచారం చేసి అవే డిమాండ్లను చెబుతున్నారని,సంస్థ పరిరక్షణకు రావలసిన బకాయిలపై కీలక సమావేశంలో మాట్లాడకపోవడం సరైనది కాదన్నారు.గతంలోనే సానుకూలతలు అని చెప్పి నేటి వరకు ఆయా ఒప్పందాలు అమలు కాకపోవడంతో పూర్తి వ్యతిరేకతతో ఉన్నారని,ఇప్పటికైనా కార్మికులను తాత్కాలికంగా సంతృప్తిపరిచే మాటలు కాకుండా, అగ్రిమెంట్ల అమలుపై అసలు నిజాలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇప్పటికే రెండు సంవత్సరాల కాలపరిమితి ముగిసిందని, అయినప్పటికీ మీ వాదన ప్రకారం గుర్తింపు పత్రం తీసుకున్నప్పటి నుండి రెండు సంవత్సరాల కాలపరిమితి వచ్చే నెల 8తో ముగుస్తుందని ఆ లోపు అగ్రిమెంట్ల అమలుపై యాజమాన్యంతో సర్క్యులర్లు ఇప్పించి,చిత్తశుద్ధి చాటుకోవాలని, బూర్జువ యూనియన్ల వలె అధికారం కోసం తాపత్రయపడకుండా ఎన్నికల కాలపరిమితి ముగిసిన తర్వాత మళ్లీ ఎన్నికలు నిర్వహించేంతవరకు అన్ని యూనియన్ సమానంగా చూసేలా పెద్దన్న పాత్ర పోషించాలని అన్నారు.ఈ సమావేశంలో సిఐటియు ఆర్జీవన్ బ్రాంచ్ నాయకులు మెండె శ్రీనివాస్, ఆరెపల్లి రాజమౌళి, జెల్ల గజేంద్ర, నంది నారాయణ, కొమ్ము రమేష్, గొట్టి తిరుపతి, ఎస్కే ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 10 లోపు సన్న వడ్ల బోనస్ కు దరఖాస్తు చేసుకోండి - ఏవో పైడిపల్లి



సుల్తానాబాద్,29(జనంసాక్షి) : మండలంలో సన్న రకం వడ్ల బోనస్ పొందేందుకు రైతులు విత్తన కొనుగోలు పత్రాలను స్థానిక ఏ ఈ ఓ వద్ద నమోదు చేసుకోవాలని, అధికారిక డీలర్లు లేదా సొంత సీడ్ ప్లాంట్ల రశీదులను సెప్టెంబర్ 10 లోపు సమర్పించాలని మండల వ్యవసాయ అధికారి పైడితల్లి తెలిపారు.వానాకాలం పండించిన పంట ప్రభుత్వ విక్రయ కేంద్రంలో విక్రయించుటకు గ్రామ వాలంటీర్ ద్వారా పంట నమోదు ప్రక్రియ తప్పనిసరన్నారు.అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకం దక్కేలా అధికారులు పనిచేస్తున్నారని,నిబంధనల ప్రకారం గడువులోగా వివరాలు సమర్పించాలని స్పష్టం చేశారు.వాలంటీర్ ద్వారా పంట నమోదు తప్పనిసరి.పంట దిగుబడిని అధికారిక కొనుగోలు కేంద్రాలలో విక్రయించడానికి గ్రామ వాలంటీర్ ద్వారా క్షేత్రస్థాయి పంట నమోదు చేయించుకోవడం తప్పనిసరని.సాగు విస్తీర్ణం, రకం వివరాలను కచ్చితంగా నమోదు చేసినప్పుడే ధాన్యం విక్రయాల సమయంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తవని ఏవో పైడితల్లి స్పష్టం చేశారు.

## సమస్య ఏదైనా క్షణంలో పరిష్కారం

**పట్టు వదలని విక్రమార్కుడు,వర వరప్రదీప్.7వ వార్డులో లీకేజీ సమస్య - పరిశీలించిన వెంటనే శాశ్వత పరిష్కారం. ఆదర్శంగా నిలుస్తున్న కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్**



సుల్తానాబాద్,ఆగస్టు 29(జనంసాక్షి) : ఏడవ వార్డులో ఏ సమస్య ఉన్న వెంటనే స్పందించి, సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పట్టు వదలని విక్రమార్కుడులా పనిచేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు ఏడవ వార్డు కౌన్సిలర్ వరప్రదీప్.వివరాలలోకి వెళితే,7వ వార్డు పరిధిలో రోడ్డుపై ఉన్న వాటర్ గేట్ వాల్వ్ లీకేజీకారణంగా తాగునీరు రోడ్డుపైకి వచ్చి వృధా అవుతూ, రోడ్డు పక్కన ఉన్న ఇళ్లలోకి చేరి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో,7వ వార్డు కౌన్సిలర్ ఉట్ల వర ప్రదీప్ వెంటనే స్పందించి,మున్సిపల్ కమిషనర్ టి రమేష్,దృష్టికి తీసుకెళ్లగా, క్షేత్రస్థాయిలో మున్సిపల్ కమిషనర్ టీ రమేష్, కౌన్సిలర్ ఉట్ల వర ప్రదీప్, మున్సిపల్ వాటర్ సప్లై సిబ్బంది సంయుక్తంగా సందర్శించి పరిశీలించిన అనంతరం,రోడ్డు మధ్యలో ఉన్న పాత గేట్ వాల్వ్ ను తొలగించి, రోడ్డు పక్కకు మార్చి కొత్త వాటర్ గేట్ వాల్వ్ ను ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపించారు. దీంతో లీకేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఇప్పుడు నీటి వృధా ఆగిపోయి, రోడ్డుపై నీరు నిలిచే సమస్య తొలగిపోవడంతో ఏడవ వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ప్రజా సమస్యలపై వెంటనే స్పందించిన కమిషనర్ రమేష్ కు వాటర్ సప్లై సిబ్బందికి కౌన్సిలర్ఉట్ల వర ప్రదీప్ కృతజ్ఞతలు తెలిపారు.

# సింగరేణిని దోచుకోవడానికే 'రివ్యూ' నాటకాలు..




గోదావరిఖని, జనంసాక్షి :
రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల దోపిడీ, అక్రమాలు శృతిమించాయని, సింగరేణి ఆస్తులను కట్టబెట్టుకోవడంతో పాటు కార్మికులు,చిరువ్యాపారుల పొట్టకొట్టే కుట్రలు చేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు,రామగుండం ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ధ్వజమెత్తారు.శనివారం రామగుండంలోని బిఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యవసర విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.స్థానిక ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) సూర్యనారాయణ,జీఎంతో కలిసి 'సింగరేణి వ్యాప్త రివ్యూ' నిర్వహించడంపై కోరుకంటి చందర్ తీవ్రస్థాయిలో ఆక్షేపించారు.అసలు సింగరేణి వ్యాప్తంగా సమీక్ష నిర్వహించడానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు ఉన్న అధికారం ఏమిటి? ఆయనకు ఆ అధికారం సిఎండి ఇచ్చారా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చారా? లేక ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చారా? అని ప్రశ్నించారు.సింగరేణి అధికారులను ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుకు పిలిపించుకుని కార్మికుల్లో సందేహాలు,భయాందోళనలు రేకెత్తిస్తున్నారని మండిపడ్డారు.

**కాంగ్రెస్ నాయకుల దోపిడీ కోసమేనా?**

స్థానిక ఓల్డ్ అశోక్ భూములను అప్పగించడానికి, ప్రైవేట్ నిర్మాణాల పేరుతో కాంగ్రెస్ నాయకులు అక్రమాలకు పాల్పడటానికి, స్థలాలను నచ్చినట్లు అమ్ముకోవడానికి అవకాశాలు ఇచ్చేందుకే డైరెక్టర్ ఆపరేషన్స్‌తో కలిసి ఈ సమీక్షలు జరుపుతున్నారని చందర్ ఆరోపించారు.సింగరేణి స్థలాల్లో నిర్మాణాలు జరిగితే సింగరేణి యాజమాన్యం బోర్డులు ఉండాలి కానీ, కాంగ్రెస్ నాయకుల ఫోటోలు పెట్టుకోవడం ఏంటని నిలదీశారు.

**సిఎస్ఆర్ నిధులపై ఎందుకు మాట్లాడరు?**

బిఆర్ఎస్ హయాంలో కెటిఆర్, హరీష్‌రావు మార్గదర్శకత్వంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో సింగరేణి నిధులు 500 కోట్ల రూపాయలతో మెడికల్ కాలేజీ (సిమ్స్- సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) సాధించడమే కాకుండా, అందులో 5% సీట్లు సింగరేణి కార్మికుల పిల్లలకే దక్కేలా చేశామని గుర్తుచేశారు.కానీ నేడు సిఎస్ఆర్ నిధుల గురించి గానీ, కార్మికుల సంక్షేమం గురించి గానీ ఎమ్మెల్యే ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

**కార్మికుల క్వార్టర్లు కూల్చేస్తున్నారు..**

సింగరేణి కార్మికులు నివాసముంటున్న క్వార్టర్లను బలవంతంగా ఖాళీ చేయించి, కూలగొడుతూ వారిని రోడ్డున పడేస్తున్నారని చందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.కార్మికులు ధర్నాలు చేస్తున్నా, ప్రశ్నిస్తున్నా పట్టించుకోకుండా అధికారులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

**సిఎండి స్పష్టత ఇవ్వాలి..**

అసలు సింగరేణి యాజమాన్యం ఏ అధికారంతో ఎమ్మెల్యేలకు ఆస్తులను, భూములను అప్పగిస్తోందో సింగరేణి సిఎండి తక్షణమే స్పందించి బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల జీవితాలతో,సింగరేణి హక్కులతో ఆడుకుంటే బిఆర్ఎస్ పార్టీ ఊరుకోదని, ప్రజాక్షేత్రంలోనూ, సింగరేణి వ్యాప్తంగానూ పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని చందర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో మిర్యాల రాజారెడ్డి, కౌశిక్ హరి,నూనె కొమురయ్య, మురళీధర్‌రావు,హరీష్ రెడ్డి,రామమూర్తి, అంతర్గాం మండల అధ్యక్షుడు సంతోష్,ఇతర మండల అధ్యక్షులు,పట్టణ అధ్యక్షులు,మాజీ కార్పొరేటర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బిఆర్ఎస్ ముఖ్య నాయకులు,కార్మిక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

- **సింగరేణి ఆస్తులు, భూములను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు కట్టబెట్టేందుకే డైరెక్టర్ సూర్యనారాయణతో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో రివ్యూ ..**
- **ఎమ్మెల్యేకు సింగరేణి వ్యాప్త సమీక్ష చేసే అధికారం ఎవరిచ్చారు..**
- **కార్మికుల క్వార్టర్లు కూలగొట్టి రోడ్డున పడేస్తారా..**
- **సింగరేణి సీఎండీ తక్షణమే స్పందించాలి..**
- **రివ్యూ లోపాయికారి ఒప్పందంపై స్పష్టమైన ప్రకటన చేయాలి..**
- **ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌తో అవినీతికి అండగా నిలుస్తున్న డైరెక్టర్ సూర్యనారాయణను సస్పెండ్ చేయాలి..**
- **మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్..**

# నిరుద్యోగ యువత, మహిళలకు ఉచిత వృత్తి శిక్షణ..

గోదావరిఖని, జనంసాక్షి :
సింగరేణి సంస్థ సామాజిక బాధ్యత స్వయం ఉపాధి కలపనలో భాగంగా సింగరేణి సేవా సమితి, రామగుండం ఏరియా-1 ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ,యువకులు, మహిళలకు స్వయం ఉపాధి కల్పించడం,వారి నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు వివిధ వృత్తి శిక్షణా కోర్సులను ఉచితంగా నిర్వహించనున్నామని సింగరేణి అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా సింగరేణి ఉద్యోగులు,మాజీ ఉద్యోగుల పిల్లలు,వారి కుటుంబ సభ్యులు, అలాగే సింగరేణి ప్రభావిత ప్రాంతాలు,పరిసర ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ,యువకులు, మహిళలు శిక్షణ పొంది ప్రయోజనం పొందవచ్చని తెలిపారు.ఈ శిక్షణ పూర్తి చేసిన అనంతరం ధృవీకరణ సర్టిఫికెట్లు కుడా అందించనున్నామని పేర్కొన్నారు.

**వృత్తి శిక్షణా కోర్సులు వివరములు :**

టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, స్పోకెన్ ఇంగ్లీష్, జూట్ అండ్ బంజారా బ్యాగ్స్ తయారీ, ఫోటోషాప్, కంప్యూటర్ డీటీపీ ఈ కోర్సుల ద్వారా శిక్షణ పొందిన అభ్యర్థులు తమ నైపుణ్యాలను ఉపయోగించుకుని స్వయం ఉపాధి పొందడంతో పాటు ఇతరులకు కూడా ఉపాధి అవకాశాలు కల్పించుకునే అవకాశం ఉంటుంది.ముఖ్యంగా మహిళలు ఇంటి వద్ద నుంచే కొన్ని వృత్తులను చేపట్టి ఆదాయం పొందేందుకు ఈ శిక్షణలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు 2పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు,ఆధార్‌కార్డు, స్టడి సర్టిఫికెట్ జిరాక్స్‌లతో ఆర్‌జీ-1 ఏరియా జీఎం కార్యాలయం, పర్సనల్ విభాగం, సింగరేణి సేవా సమితి కార్యాలయంలో స్వయంగా సంప్రదించాలని కోరారు.

**ఫ్యాకల్టీలకు దరఖాస్తులకు ఆహ్వానం..**

వృత్తి శిక్షణా కోర్సులలో శిక్షణ అందించేందుకు తగిన ప్రతిభ, అనుభవం కలిగి,గుర్తింపు పొందిన సంస్థల నుండి అర్హత కలిగిన,ఆసక్తి గల ఫ్యాకల్టీలు తమ విద్యార్హతలు, అనుభవం,సంబంధిత ధృవీకరణ పత్రాలతో సెప్టెంబర్ 10వ తేదీలోపు దరఖాస్తులను ఆర్‌జి-1 ఏరియా జీఎం కార్యాలయం, పర్సనల్ విభాగం, సింగరేణి సేవా సమితి కార్యాలయంలో స్వయంగా సంప్రదించాలని సూచించారు.

# సింగరేణి కార్మికుల హక్కులను తాకట్టు పెట్టిన ఏఐటీయూసీ..

## - టీబీజీకేస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి..

గోదావరిఖని, జనంసాక్షి :
సింగరేణి కార్మికుల హక్కులను తాకట్టు పెట్టి ఏఐటీయూసీ డ్రామాలు ఆడుతుందని టీబీజీకేఏస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. గోదావరిఖనిలో ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజిరెడ్డి మాట్లాడారు.సింగరేణి బొగ్గు గని కార్మికుల ప్రధాన సమస్యలను, డిమాండ్లను పక్కనబెట్టి, యాజమాన్యంతో స్పష్టత లేని ఒప్పందాలు కుదుర్చుకున్నామని ఏఐటీయూసీ నాయకత్వం కార్మిక రంగానికి ద్రోహం చేస్తోందని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఏస్) తీవ్రంగా ఆక్షేపిస్తుందన్నారు. కార్మికులను మభ్యపెట్టేందుకు అరకొర ఒప్పందాలను చూపిస్తూ ఏఐటీయూసీ డ్రామాలు ఆడుతోందని,ఈ అస్పష్ట ఒప్పందాలపై వెంటనే పూర్తి వివరాలు,సర్క్యులర్లు విడుదల చేయాలని టీబీజీకేఏస్ నాయకులు డిమాండ్ చేశారు.పరిహారం అండ్ ఇన్సూరెన్స్‌పై స్పష్టత, సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికులకు ఇచ్చే రూ.20 లక్షల యాజమాన్య పరిహారంపై పూర్తి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఇది వరకు ఉన్న మ్యాచింగ్ గ్రాంట్, ప్రమాద భీమా కాకుండా ఇది మూడోదా.. కాదా.. అనేది ఒప్పంద పత్రాలు, సర్క్యులర్ల ద్వారా బయటపెట్టాలన్నారు. ప్రతి నెలా మెడికల్ మెడికల్ బోర్డు నిర్వహించి వందకు వంద శాతం కార్మికులను మెడికల్ అన్‌ఫిట్ చేపిస్తామని చెప్పారని, ఇప్పుడు కనీసం దాని గురించి మాట్లాడట్లేదని పేర్కొన్నారు.కనీసం నెలలో ఒక్క బోర్డు కూడా నిర్వహించడం లేదని, దరఖాస్తు చేసుకున్న వారిలో ఎంతమందికి అవకాశం దక్కుతుందో స్పష్టం చేయడం లేదని మండిపడ్డారు.గత రెండు సంవత్సరాల వాస్తవ లాభాల ప్రకటనలో పారదర్శకత లేదని,సంస్థ అభివృద్ధి పేరుతో నిధులను పక్కదారి పట్టించే కుట్రలు మళ్లీ పునరావృతమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.డిస్మిస్ కార్మికుల రక్షణ ఏదని,గత రెండున్నరేళ్లలో డిస్మిస్ అయిన కార్మికులకు తిరిగి ఉద్యోగాలు ఇప్పించకపోగా, సరికొత్త నిబంధనల (100/150 మస్టర్లు) పేరుతో 200 మందికి పైగా కార్మికులను రోడ్డున పడేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇది గుర్తింపు కార్మిక సంఘం వైఫల్యమైన అని పేర్కొన్నారు.రక్షణ వస్తువులు (పీపీఈ కిట్లు), డ్రిల్ బిట్లు, రెజిన్/సిమెంట్ క్యాప్సూల్స్, డాగ్ నైల్స్ వంటి ప్రాథమిక పనిముట్లు లేక కార్మికులు శ్రమ చేస్తుంటే, యాజమాన్యం చట్టబద్ధంగా ఇవ్వాల్సిన పీపీఈ కిట్లను తామేదో సాధించినట్లు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో నిర్మిస్తామన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎప్పటికి అందుబాటులోకి వస్తుందో చెప్పాలని రాజిరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఆర్ఎంఎస్ కార్డు కలిగిన రిటైర్డ్ కార్మికులకు వారం రోజుల ఉచిత ఇన్-పేషెంట్ చికిత్స పరిమితి వల్ల పూర్తి మేలు జరగదని,ఆపరేషన్లను కూడా ఉచితంగా చేయాలని కోరారు.బదిలీలలో 3ఏళ్ల నిబంధన రద్దు, మారు పేర్ల సవరణకు కమిటీల పేరుతో కాలయాపన చేయడం, కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ/ఈపీఎఫ్ అమలు, 149 మంది పెండింగ్ డిపెండెంట్లకు ఉద్యోగాలు ,పెర్క్స్‌పై రికవరీ అయిన ఇన్‌కమ్‌టాక్స్ రీయింబర్స్ మెంట్ ఏ సంవత్సరం నుంచి వర్తింపజేస్తారనే విషయాలపై పూర్తిస్థాయి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.విలేకరుల సమావేశంలో టీబీజీకేఏస్ నాయకులు మాదాసి రామమూర్తి, నూనె కొమరయ్య, పర్లపల్లి రవి, చెల్పూరి సతీష్, దూట శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

